PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 207 | విజయవాడ, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 28 February 2025 | Rs



సత్తా చాటిన గుజరాత్ బౌలర్లు

- బెంగళూరు మహిళలపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు 8

హక్కుల కోసం నినదించిన లఘు చిత్రాలకు మానవ హక్కుల కమిషన్ పురస్కారాలు

- 'ఫైట్ ఫర్ రైట్స్'కు ద్వితీయ బహుమతి
- 'లైఫ్ ఆఫ్ సీత', 'బి-ఎ హ్యూమన్' చిత్రాలకు ప్రత్యేక ప్రశంస



8

అధికార అక్రమాలు

ఎంఎల్‌సి ఎన్నికల్లో పలుచోట్ల దౌర్జన్యాలు, పిడిఎఫ్ కార్యకర్తలపై దాడులు

పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యేల హల్‌చల్ • మంగళగిరిలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు కారుపై దాడి

అడ్డుకోబోయిన ఆయన కుమారునిపై, డ్రైవర్‌పైనా జులుం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం కూటమి అక్రమాలకు తెగబడింది. పిడిఎఫ్‌కు సానుకూల వాతావరణం నెలకొందన్న వార్తల నేపథ్యంలో ఓటమి భయంతో అడ్డదార్లు తొక్కింది. ఓటర్లను ప్రలోభపెట్టడానికి శక్తిమేర ప్రయత్నించింది. కుదరనిచోట్ల దౌర్జన్యాలు, దాడులకు దిగింది. భయోత్పాతం కలిగించడమే లక్ష్యంగా కొన్ని చోట్ల పిడిఎఫ్ కార్యకర్తలపై దాడులు చేసింది. టిడిపి కూటమి చర్యలతో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నియోజకవర్గంలో మంత్రులు, ఎంఎల్‌ఏల సమక్షంలోనే పెద్దఎత్తున అక్రమాలు, దాడులు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎంఎల్‌సి, ప్రస్తుత పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును కొన్ని చోట్ల కూటమి శ్రేణులు లక్ష్యంగా చేసుకున్నాయి. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలోని పిఠాపురంలో ఓటర్లకు డబ్బులు పంచుతూ ఆ పార్టీ నాయకులు మీడియాకు దొరికారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఉత్తరాంధ్ర టీచర్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఒకవైపు దాడుల పర్వం కొనసాగుతున్నా పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ స్టేషన్లకు తరలివచ్చారు.

కృష్ణా- గుంటూరు జిల్లాలో...

ఉమ్మడి కృష్ణా -గుంటూరు జిల్లాలో టిడిపి ఎమ్మెల్యేలు దగ్గరుండి తమ అనుయాయులను పోలింగ్ కేంద్రాలకు పంపారు. వారు. మాచర్ల, దుర్గి, కారంపూడి, వెల్దుర్తి, నరసరావుపేట, యడ్లపాడు, చిలకలూరిపేట, పెదకూరపాడు, అమరావతి, బెల్లంకొండ, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, మంగళగిరి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో భారీగా దొంగ ఓట్లు పోల్‌అయినట్టు సమాచారం. మంగళగిరిలో పోలింగ్ సరళి పరిశీలనకు వచ్చిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావు కారుపై టిడిపి కూటమి శ్రేణులు దాడులకు దిగాయి. అడ్డుకోబోయిన ఆయన డ్రైవర్ శ్రీనివాస్, లక్ష్మణరావు కుమారుడు అలిన్‌లపైనా దాడి చేసి కొట్టారు. బాపట్లలో దొంగ ఓట్లు అడ్డుకోవడానికి ప్రయత్నించి పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్‌పై దాడిచేశారు దుగ్గిరాలలో 286, 288 కేంద్రాల్లో పిడిఎఫ్ ఏజెంట్లుగా ఉన్న తమను టిడిపి నాయకులు దౌర్జన్యంగా బయటకు లాగేసి దొంగ ఓట్లు వేయించారనిఎం.నరసింహారావు, జి.శ్రీనివాసరావు ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. గుంటూరులోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు, నశీర్ అహ్మద్ హల్‌చల్ చేశారు. నరసరావుపేటలో పట్టణంలో దొంగ ఓట్లు వేసేందుకు టిడిపి నాయకులు యత్నించగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పిడిఎఫ్ ఏజెంట్లు అడ్డుకున్నారు. భరంపేట 375వ పోలింగ్ కేంద్రంలో మిగతా 7లో

పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
కృష్ణ-గుంటూరు (గ్రాడ్యుయేట్)	3,47,116	2,41,502	69.57
ఉమ్మడి గోదావరి జిల్లాల (గ్రాడ్యుయేట్)	3,14,984	2,18,902	69.50
ఉత్తరాంధ్ర జిల్లాలు (ఉపాధ్యాయ)	22,493	20,783	92.40



పోలింగ్ బూత్‌లోకి అనుచరులతో వెళ్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఓటర్లకు డబ్బులు పంచుతున్న టిడిపి పిఠాపురం మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్

అధికార పార్టీ అక్రమాలపై చర్యలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ 2

టిడిపి దౌర్జన్యాలపై ఇసికి ఫిర్యాదు

- పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

రూ.3.18 లక్షల కోట్లు!

నేడే వార్షిక బడ్జెట్ ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



2025-26 ఆర్థిక సంవత్సంపు బడ్జెట్‌ను నేడు (శుక్రవారం) రాష్ట్ర ప్రభుత్వం ఉభయసభల్లో ప్రవేశపెట్టనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఈసారి బడ్జెట్ రు.3.18 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆర్థికశాఖ కసరత్తు పూర్తయింది. శుక్రవారం ఉదయం జరిగే కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర పడిన అనంతరం ఉభయసభల ముందుకు బడ్జెట్ ప్రతిపాదనలు రానున్నాయి. బడ్జెట్ ప్రతిపాదనల్లో సంక్షేమాన్ని కొనసాగించడంతో పాటు, సూపర్ సిక్స్‌లోని మిగిలిన మూడు పథకాలను కూడా నిధులు కేటాయించనున్నట్లు సమాచారం. శాసనసభలో ఆర్థిక బడ్జెట్‌ను పయ్యావుల కేశవ్, వ్యవసాయ బడ్జెట్‌ను అచ్చెన్నాయుడు ప్రవేశపెడతారు. శాసనమండలిలో కొల్లు రవీంద్ర ఆర్థిక బడ్జెట్‌ను, నారాయణ వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.గత ఏడాది 2,94,427 కోట్లకు బడ్జెట్‌ను ప్రతిపాదించగా, ద్రవ్య వినిమయ బిల్లులో ఆ మొత్తాన్ని 3,04,020 కోట్లకు సవరించారు. దీంతో తొలిసారిగా మూడు లక్షల కోట్ల మార్కును రాష్ట్ర బడ్జెట్ దాటినట్లయింది. అలాగే గత ఏడాది జూన్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తరువాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం కూడా ఇదే తొలిసారి కావడం గమనార్హం. అందుకే ఈ బడ్జెట్‌లో తనదైన ముద్ర వేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.. గత బడ్జెట్‌లో రెవిన్యూ వ్యయానికి రు. 2.36 లక్షల కోట్లు కేటాయించగా ఈ సారి 2.45 లక్షల కోట్ల వరకు కేటాయింపులు ఉండవచ్చునని అంటున్నారు. పెట్టుబడి వ్యయానికి గత బడ్జెట్‌లో 32 వేల కోట్లు వరకు కేటాయించగా, ఈసారి స్వల్ప పెరుగుదలతో 35 వేల కోట్లువరకు ఉంటుందని సమాచారం.

కేంద్ర పథకాలకు ఎలా

ఈసారి కేంద్ర ప్రాయోజిత పథకాలకు 38 వేల కోట్లు రానుండగా, అందుకుగాను రాష్ట్రం కూడా కనీసంగా 15 వేల కోట్లకుపైగా తన వాటా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిధులను తాజా బడ్జెట్‌లో ఎలా పొందుపరుస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇక రుణాలు కూడా బడ్జెట్ ప్రతిపాదనల కన్నా ఎక్కువగా చేస్తుండడంతో ఈసారి ఎంతవరకు ప్రతిపాదిస్తారన్నది చూడాలి. గత ఏడాది రు.71 వేల కోట్లు రుణాలుగా తీసుకోనున్నట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటికే 85 వేల కోట్లు తీసుకోవాల్సి వచ్చింది. దీంతో ఈసారి బడ్జెట్‌లో రుణాలను కనీసంగా 80 వేల కోట్ల వరకు చూపించే అవకాశం ఉందని సమాచారం. సూపర్ సిక్స్‌లోని పథకాలు మినహా ఇతర కొత్త పథకాలేవి ఈ బడ్జెట్‌లో ఉండవని అంటున్నారు.

16 శాతం వృద్ధి ఎలా?

ప్రతి రంగంలోనూ ఈ ఏడాది 16 శాతం వృద్ధి సాధించాలని ఇప్పటికే చంద్రబాబు చెప్పిన నేపథ్యంలో ఆ స్థాయిలో నిధులు విడుదల ఎలా అన్నది వేచి చూడాల్సి ఉంది. ఇలా వృద్ధిని సాధించాలంటే మొత్తం బడ్జెట్‌ను దాదాపుగా మూడున్నర లక్షల కోట్లకు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అంత భారీ బడ్జెట్ అసాధ్యమని, వృద్ధికి అవసరమైన శాఖలకు ఎక్కువగా కేటాయింపులు చేసి, ఇతర శాఖల్లో తగ్గించేందుకు ప్రయత్నించవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

దాతృత్వంతో పేదరిక నిర్మూలన

- సంక్షేమంలోనూ పి4
- ఉగాది నుండి ప్రారంభం
- సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంపదలో పైవరుసలో ఉన్న కుటుంబాలు తమ దాతృత్వంతో సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలని, తద్వారా పేదరిక నిర్మూలనకు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన సంక్షేమరంగంలో పి4 (పబ్లిక్ ఫిలాంత్రిఫిక్ పీపుల్ పార్టిసిపేషన్) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అదనంగా ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. అట్టడుగున ఉన్న వారికి మరింత చేయూతను అందించడం, పేదరికాన్ని నిర్మూలించడం ఈ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. పేదలను ఆదుకునేందుకు నిర్మాణాత్మకమైన, స్థిరమైన విధానం ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉగాది నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాలుగు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు రూపొందించిన కార్యాచరణను అధికారులు సిఎంకు వివరించారు. దీనివల్ల 5,869 కుటుంబాలు లబ్ధిపొందుతాయని పేర్కొన్నారు.



'ఆ' పి4 వేరు!

పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్రంలో పి4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్‌షిప్) విధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనర్థం కార్పొరేట్లు పెట్టుబడులు పెట్టే ప్రాంతంలో ప్రజలను స్టేక్‌హోల్డర్స్‌గా మారుస్తారు. అంటే, లాభనష్టాల్లో ప్రజలకు వాటా ఇస్తారు. ఆ మేరకు వారితో ఒప్పందం చేసుకుంటారు. ఈ పేరుతో చట్ట ప్రకారం చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని నిలిపివేసే అవకాశం కార్పొరేట్ సంస్థలకు లభిస్తుంది. రాజధాని ప్రాంతంలో జరిగిన భూసమీకరణ దీనికో ఉదాహరణ! విజన్ 2047తో పాటు వివిధ పాలసీల అమలులో భాగంగా ఈ పి4 కొనసాగుతుంది. సంక్షేమ రంగంలో పి 4 (పబ్లిక్ ఫిలాంత్రిఫిక్ పీపుల్ పార్టిసిపేషన్) అంటే ప్రభుత్వరంగం, మిగతా 7లో

ఉ.7 గంటల నుండి పింఛను పంపిణీ

- సెర్ప్ సిఇఒ కరుణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ సమయంలో మొబైల్ యాప్‌లో ఉన్న ఆడియో సందేశాన్ని పింఛను దారులకు వినిపించాలని సెర్ప్ సిఇఒ వాకాటి కరుణ పేర్కొన్నారు. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. పింఛను పథకాన్ని ప్రభుత్వ ప్రచార విధానంలోకి చేర్చినట్లు, పంపిణీలో నాణ్యత, పింఛను దారుల్లో సంతృప్తి పెంచేందుకు మొబైల్ అప్లికేషన్‌లో మార్పులు చేసినట్లు తెలిపారు. వృద్ధులైన పింఛనుదారులకు నగదు ఇచ్చే ముందు నమస్కారాలు తెలియజేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పింఛనుదారుల ఇంటి నుంచి 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పింఛను పంపిణీ చేసినప్పుడు మొబైల్ యాప్‌లో చూపిస్తుందని, ఇందుకు కారణాలను అక్కడ నమోదు చేసి పింఛను పంపిణీ చేయాలని తెలిపారు. పంపిణీని ఉదయం 6 గంటలకు బదులుగా 7 గంటల నుంచి ప్రారంభించాలని ఆదేశించారు.



రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10,58,893 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 5,00,963 మంది, ఒకేషనల్ 44,581 మంది హాజరు కానున్నారు. శనివారం నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్‌కు 4,71,021 మంది, వొకేషనల్ 44,581 మంది ఉన్నారు. వీరికి మార్చి 3వ తేది నుంచి 20వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 1535 పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసింది. ప్రతి 20 కేంద్రాలకు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించింది. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసింది. వీటిని రాష్ట్ర, జిల్లా కేంద్రాల ద్వారా పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు.

స్మార్ట్ మీటర్లపై ఎపిఇఆర్‌సి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నప్పటికీ పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైనా లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని డిస్కంలు ప్రతిపాదించిన విధంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ ఎపిఇఆర్‌సి ఇచ్చిన తీర్పును సిపిఎం రాష్ట్ర కమిటీ వ్యతిరేకించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తీర్పును తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. క్వాజీ జ్యుడీషియల్ అథారిటీగా ఉంటూ వినియోగదారుల హక్కులను పరిరక్షించాల్సిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాంగంగా మారిపోయిందని తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని, బిగింపులను ఎక్కడకక్కడ తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇది నూటికి నూరు పాళ్లు కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఉద్దేశించిందని, వినియోగదారులపై అదనపు భారం అవుతుందని, బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి గాని, ఎపిఇఆర్‌సికి గాని లేదని సిపిఎం పేర్కొంది. ఒక వైపు ఛార్జీలు పెంచడం లేదంటూనే మరోవైపు ఛార్జీల పెంపుదలకు మూలంగా ఉండే స్మార్ట్ మీటర్లు బిగించడం దొడ్డిదారిన ఛార్జీల భారాన్ని పెంచడమేనని తెలిపింది. దీనికి ముందు సెకీ ద్వారా అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను ఎపిఇఆర్‌సి ఖరారు చేసిందని, ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా అదానీ అవినీతి బట్టబయలై, ఆ ఒప్పందాలను పలు రాష్ట్రాలు, దేశాలు తిరస్కరించి వెనక్కు పంపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి దానికి ఆమోదముద్ర వేయడం అవినీతికి ఆమోదం తెలపటమేనని పేర్కొంది.

లక్షా ఇరవై వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని వినియోగదారులపై వేసే హక్కు ఎపిఇఆర్‌సికి లేదని వివరించారు. సెకీతో జరిగిన ఒప్పందాల వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతుందని విద్యుత్ శ్వేతపత్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో పేర్కొన్నదని వివరించారు. అయినా ఎపిఇఆర్‌సి దీనికి ఆమోదం తెలపడం గర్హనీయమని, వెంటనే సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాంగంగా ఉన్న ఎపిఇఆర్‌సి వల్ల వినియోగదారులకు మిగతా 2లో


బాపట్లలో దొంగ ఓట్లను అడ్డుకున్న పిడిఎఫ్ కార్యకర్త ఎస్. అనిల్‌పై కూటమి దాడి


మంగళగిరిలో పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్సీ లక్ష్మణరావు కుమారుడిని చుట్టుముట్టి దౌర్జన్యం చేస్తున్న టిడిపి కార్యకర్తలు


నిజాంపట్నం గ్రామం ఎంపియుపి పాఠశాల పోలింగ్ బూత్ వద్ద అధికారులపై బెదిరింపులకు దిగిన టిడిపి నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి నాయకుల హల్‌చల్

- నిజాంపట్నంలో ఆర్ఐకి బెదిరింపులు
- పలుచోట్ల ఓటర్లకు ప్రలోభాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి నాయకులు హల్‌చల్ చేశారు. ఎన్నికల అధికారులు, పిడిఎఫ్ ఏజెంట్లపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం, నిజాంపట్నం గ్రామం ఎంపియుపి పోలింగ్ కేంద్రం వద్ద నిజాంపట్నం రెవెన్యూ ఆర్ఐ హనీపై అధికార పార్టీ నాయకులు మాటలతో విరుచుకుపడ్డారు. గుర్తింపు కార్డులు లేకుండా కొందరిని స్లిప్పులుతో పోలింగ్ కేంద్రంలోకి తీసుకొచ్చి వారితో ఓటింగ్ వేసేందుకు అనుమతించాలని అధికార పార్టీ నేతలు కోరారు. గమనించిన ఆర్ఐ హనీ, మహిళా పోలీసులు వారిని అడ్డుకొని పోలింగ్ బూత్ పిఒ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్సైను పిలిపించి... గుర్తింపు కార్డులు లేని వారిని బయటికి పంపించారు. ఇది జీర్ణించుకోలేని టిడిపి రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, మండల పార్టీ నాయకులు వెంకట యాదవ్ పలువురు కలసి ఎన్నికల విధుల్లో ఉన్న హనీతో వాగ్వాదానికి దిగారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు దొంగ ఓటు వేసేందుకు భట్టిప్రోలు టిఎం.రావు ఉన్నత పాఠశాలలోని 397 పోలింగ్‌బూత్‌లో టిడిపి కార్యకర్త కంభం సుధీర్ ప్రయత్నించగా పిడిఎఫ్ ఏజెంట్ శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. 'నన్నే ఆపుతావా..' అంటూ శ్రీనివాసరావును చొక్కా పట్టుకొని కిందపడేసి అతని ఐడెంటిటీ కార్డుని చించివేశాడు. ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రం వద్ద దొంగ ఓట్లను అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు లక్ష్మణరావు మద్దతుదారు, పిడిఎఫ్ కార్యకర్త ఎస్.అనిల్‌కుమార్‌పై టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు దాడికి తెగబడ్డాడు. శ్రీనివాసరావుపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్యతో కలిసి పట్టణ పోలీసులకు అనిల్‌కుమార్ ఫిర్యాదు చేశారు.


పిడుగురాళ్ల పట్టణం జడ్‌పిహెచ్ స్కూల్‌లో దొంగ ఓట్లు వేస్తున్న వారిని అడ్డుకుంటున్న పిడిఎఫ్ ఏజెంట్లు

పాలకొల్లులో పట్టభద్రుల ఓటర్లకు ఓటుకు రూ.వెయ్యి పంపిణీపై పెద్దఎత్తున దుమారం రేగింది. పెదవేగిలోని 324, 325, 326, 327 పోలింగ్ కేంద్రాల్లో టిడిపి కూటమి నేతలు దొంగ ఓట్లు వేయిస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి.

దీనిపై నిలదీసిన పిడిఎఫ్ శ్రేణులు, ఏజెంట్లు జి.శివకుమార్, పి.రామకృష్ణపై టిడిపి కూటమి నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, వారి అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఏలూరులో అధికారపక్ష నాయకులు, కార్యకర్తలు యథేచ్ఛగా పోలింగ్ బూత్ పరిసరాల్లో తిరుగుతూ, ప్రహరీ గేటు దాటి లోపలికి వచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ, స్లిప్పులు పంచుతూ కనిపించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు వారు ప్రయాణించిన టికెట్ చూపిస్తే టికెట్ ధరకు సరిపడా డబ్బులు కూడా పంచినట్లు సమాచారం. ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల వద్ద ఓటర్లకు సహాయం చేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్యను నిబంధనల ఉల్లంఘన నెపంతో పోలీసులు అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అనంతరం విడుదల చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులు తరఫున ఓటర్లకు సహాయం చేస్తున్న సోమయ్యను టూటౌన్ పోలీసులు టిడిపి వారి ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమంగా అరెస్టు చేశారు. 41 నోటీసు ఇచ్చి సొంత పూచీకత్తుపై ఆయనను విడుదల చేశారు. శ్రీకాకుళం లావేరు మండలంలో కూటమి నాయకులు ఎన్నికల శిబిరం వద్ద ఓటర్లకు గుట్టుచప్పుడు కాకుండా స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు.

తాగునీటికే తొలి ప్రాధాన్యం

- తెలుగు రాష్ట్రాలకు కెఆర్ఎంబి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగునీటికే తొలి ప్రాధాన్యమివ్వాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) తెలుగు రాష్ట్రాలను ఆదేశించింది. రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకుని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించింది. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన కెఆర్ఎంబి సమావేశమైంది. దీనికి రెండు రాష్ట్రాల అధికారులు హాజరయ్యారు. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇఎన్‌సి జి అనిల్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఇఎన్‌సి వెంకటేశ్వరరావు, ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టిఎంసిలు కావాలనీ తెలంగాణ, 55 టిఎంసిలు కావాలని ఆంధ్రప్రదేశ్ తాజాగా బుధవారం నాటి చీఫ్ ఇంజనీర్ల సమావేశం అనంతరం నివేదికలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు రిజర్వాయర్లల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టిఎంసిలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్దిపాటి నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని రెండు రాష్ట్రాలకు బోర్డు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. పంటలను దృష్టిలో ఉంచుకుని మిగులు జలాలను ప్రణాళికబద్ధంగా వాడుకోవాలని పేర్కొంది. 15 రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని తెలుగు రాష్ట్రాలకు సూచించింది. ఈ మేరకు కెఆర్ఎంబి ఉత్తర్వులు జారీచేసింది.

ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలపై చర్యలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనమండలి ఎన్నికల్లో ప్రత్యేకించి రెండు గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లో తెలుగుదేశం అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడటాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏకపక్షంగా పోలింగు జరిగిన బూతుల్లో రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే వీలు లేకుండా అధికార పార్టీ శాసనసభ్యులు, మంత్రులు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ఈ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. అనేకచోట్ల ఉపాధ్యాయులను నయానా, భయానా లొంగదీసుకునే ప్రయత్నాలు చేశారని, బెదిరింపులకు పాల్పడ్డారనీ పేర్కొన్నారు. అనేక చోట్ల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ స్టేషన్లలోకి చొరబడి ప్రచారం చేయడమే గాకుండా ప్రత్యర్థి అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లను బెదిరించారని తెలిపారు. ప్రత్యేకించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రత్యర్థి అభ్యర్థుల ఏజెంట్లను బెదిరించడమే కాకుండా కొన్ని బూత్‌ల నుండి బైటకు గెంటేసి ఓట్లు గుద్దుకున్నారని వివరించారు. అనగాని సత్యప్రసాద్, ప్రత్తిపాటి పుల్లారావు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో బుద్ద వెంకన్న సహా తెలుగుదేశం ఎమ్మెల్యేలు, మంత్రులే ప్రత్యక్షంగా దగ్గరుండి దొంగ ఓట్లు గుద్దించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేశారని తెలిపారు.

అనేకచోట్ల పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి నిర్వీర్యం చేశారని, పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక్షంగా శాసన సభ్యులే కూర్చుని దొంగ ఓట్లు వేయించారని పేర్కొన్నారు. దొంగ ఓట్లు వేయడాన్ని ప్రశ్నించిన వారిపై మంగళగిరి, బాపట్ల, భట్టిప్రోలు, చిలకలూరిపేట ప్రాంతాల్లో దాడులు చేశారని తెలిపారు. బెల్లంకొండలో దౌర్జన్యం చేయడమే కాకుండా ప్రత్యర్థి ఏజెంట్లపై తప్పుడు కేసులు బనాయించారని వివరించారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రత్యేకించి వెల్దుర్తిలో ప్రత్యర్థులపై దౌర్జన్యం చేసి ఏజెంట్లు లేకుండా ఏకపక్షంగా గుద్దేసుకున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్నం నుండి ఒక పథకం ప్రకారం అధికార పార్టీ ప్రతినిధులు అనేకచోట్ల ఒక క్రమపద్ధతిలో దొంగ ఓట్ల కార్యక్రమాన్ని నిర్వహించారని, పిఠాపురంతో సహా అనేక నియోజకవర్గాల్లో డబ్బులు విచ్చలవిడిగా పంచినట్లు మీడియాలో వీడియోలు వచ్చినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. స్వేచ్ఛగా ఎన్నిక జరిగితే గెలవలేమనే భయంతోనే అధికార పార్టీ ఇలాంటి చర్యలకు పాల్పడిందని పేర్కొన్నారు. భారీగా ఓట్లు నమోదైన, ఘర్షణలు జరిగిన పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిని వెబ్‌కెమెరాల ద్వారా పరిశీలించి బాధ్యులపై తగుచర్యలు చేపట్టాలని, ప్రత్యక్షంగా జొరబడి అక్రమాలకు సారథ్యం వహించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది.

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

- స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన బ్యాలెట్ బాక్సులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎన్నికలో 93.55 శాతం, ఉమ్మడి కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ జిల్లాల నియోజకవర్గ గ్రాడ్యుయేట్ స్థానానికి 70.42 శాతం, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 91.90 శాతం పోలింగ్ నమోదైంది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు స్థానాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఖమ్మంలో బిజెపి నేతలు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. ఆదిలాబాద్, కరీంనగర్ కేంద్రాల్లో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బ్యాలెట్ బాక్సులను నల్లగొండ, కరీంనగర్ కేంద్రాలకు తరలించి, భద్రపరిచారు. మార్చి 3వ తేదీన ఓట్ల కౌంటింగ్ నిర్వహించనున్నారు. మొత్తంగా ఆరు ఫిర్యాదులు అందినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొంది.


పల్నాడు జిల్లా బెల్లంకొండలో టిడిపి నాయకుల దాడిలో గాయపడిన పిడిఎఫ్ ఏజెంట్


పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో పోలింగ్ బూత్‌లోకి తన మద్దతుదారులతో వెళ్లిన మంత్రి రామానాయుడు


గుంటూరు హిందూ కాలేజ్‌లో పోలింగ్ బూత్ వద్ద హల్‌చల్ చేస్తున్న టిడిపి కార్యకర్తలు

పూర్తిస్థాయిలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి

- 95శాతం పిఎల్ఎఫ్ సాధించిన కృష్ణపట్నం యూనిట్
- జెన్‌కో ఎమ్‌డి చక్రధర్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిజెన్‌కో యూనిట్లు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు వెల్లడించారు. 2025 జనవరి నుంచి 100 మిలియన్ యూనిట్లు(ఎంయు)పైగా స్థిర విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించిందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 123 ఎంయుల విద్యుత్ ఉత్పత్తితో సరికొత్త రికార్డు నెలకొల్పిందని పేర్కొన్నారు. శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ ((కృష్ణపట్నం) (ఎస్‌డిఎస్‌టిపిఎస్)) లోని యూనిట్-3(800 మెగావాట్లు) ప్రారంభమైన నవంబర్ 18 నుంచి నిరంతరాయంగా 100 రోజుల పాటు ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేసిందని వివరించారు. 1596.30 ఎంయులు ఉత్పత్తి చేయగా, 95శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పిఎల్ఎఫ్)తో అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శించిందని పేర్కొన్నారు. గరిష్ట ఉత్పత్తి ఈ నెల 18వ తేదిన సాధించిందని తెలిపారు. ఎస్‌డిఎస్‌టిపిఎస్ రోజుకు 45 ఎంయుల ఉత్పత్తి చేస్తోందని, జెన్‌కో థర్మల్ ఉత్పత్తిలో 40శాతం వాటా కలిగి ఉందని వివరించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చేందుకు, విద్యుత్ సరఫరా అందించేందుకు జెన్‌కో కట్టుబడి ఉందని తెలిపారు. బొగ్గు నిల్వలను మరింతగా మెరుగుపరిచి నిరంతరాయంగా ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ఉత్పత్తి విధానాలను అనుసరిస్తూ, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ తన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు జెన్‌కో కృషి చేస్తోందని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సహాయ సహకారాలు, దిశానిర్దేశాలతో విద్యుత్ ఉత్పత్తిలో రికార్డులు నెలకొల్పుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్, రైతులకు 9 గంటల విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తనవంతు కృషి జెన్‌కో అందిస్తుందని తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకునే దిశగా ప్రణాళికలు రూపొందించి, ఆ దిశగా ఉద్యోగులు, సిబ్బంది కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు.

ముమ్మరంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,783 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92.40 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా 5,529 ఓటర్లు కలిగిన విశాఖపట్నం జిల్లాలో 4,829 మంది వారి హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 87.34 శాతం ఓటింగ్ నమోదైంది. విజయనగరం జిల్లాలో 5,223 మంది ఓటర్లు ఉండగా 4,912 మంది ఓటేశారు. 94.05 శాతం పోలింగ్ నమోదయ్యింది. పార్వతీపురం జిల్లాలో 93.74 శాతం పోలింగ్ నమోదవ్వగా 2,333 ఓటర్లకుగాను 2,187 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం 2,885 ఓట్లు ఉండగా 2,776 పోలయ్యాయి.


అల్లూరి జిల్లా పాడేరులో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చొన్న ఉపాధ్యాయులు

అక్కడ 96.22 శాతం పోలింగ్ జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,488 మందికిగాను 1,310 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 88.04 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 5,035 మంది ఓటర్లు ఉండగా 4,769 మంది ఓటెయ్యగా 94.72 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉత్తరాంధ్రలోని 123 పోలింగ్ కేంద్రాల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు ఆర్‌ఒ హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విశాఖలోని పెందుర్తి ప్రభుత్వ పాఠశాలలో బూత్ నెంబర్ 113లో 523 సీరియల్ నెంబర్‌తో ఉన్న అనూరాధ శెట్టి ఓటువేసేందుకు వెళ్లగా అప్పటికే ఓటు వేసినట్లు చెప్పి సిబ్బంది పంపించేశారు. అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడి ఆమె ఛాలెంజ్ ఓటు వేశారు. అల్లూరి జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్, ఎస్‌పి అమిత్ బర్గర్ సందర్శించారు. అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బూత్ నెంబర్ 82 వద్ద ఉదయం నుంచీ ఉపాధ్యాయులు బారులుతీరారు. గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తన సొంత మండలం అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో క్యూలైన్‌లో నిలబడి ఓటు వేశారు.


మంగళగిరిలో లక్ష్మణరావుతో వాగ్వాదానికి దిగిన పోలీసు


టిడిపి దౌర్జన్యాలపై ఇసికి ఫిర్యాదు

- పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పట్టభద్రుల ఎన్నికల్లో కూడా దౌర్జన్యం చేయడం ద్వారా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే రీతిలో టిడిపి నాయకులు వ్యవహరించారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు విమర్శించారు. గుంటూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తమ ఏజెంట్లపై దౌర్జన్యం చేశారని, దాడి చేసి కొట్టారని, పల్నాడు జిల్లా వెల్దుర్తిలో పిడిఎఫ్ ఏజెంటును అనుమతించలేదని మాచర్ల, దుగ్గిరాల, దుర్గి ప్రాంతాల్లో తమ ఏజెంట్లను బయటకు పంపి టిడిపి వారు దొంగ ఓట్లువేసుకున్నారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఎమ్మెల్యేలు నేరుగా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి దొంగ ఓట్లు వేయించడం వంటి దారుణాలకు తెగబడ్డారని విమర్శించారు. ప్రణాళికాబద్ధంగా దొంగ ఓట్లు వేశారని, మంగళగిరి, తెనాలి తదితర ప్రాంతాల్లో అధికార పార్టీ దౌర్జన్యంగా వ్యవహరించిందని తెలిపారు. సాధారణంగా పట్టభద్రుల ఎన్నికల్లో 60 నుంచి 65 శాతం పోలింగ్ జరుగుతుందని, ఈసారి 70 వరకు జరిగిందని చెప్పారు. అంతేగాక పల్నాడులో కొన్ని ప్రాంతాల్లో 80కిపైగా పోలింగ్ జరిగిందన్నారు. చిలకలూరిపేట ఆర్‌విఎస్ పాఠశాలలో పిడిఎఫ్ ఏజెంటుగా ఉన్న రైతు సంఘం నాయకులు రాధాకృష్ణను బలవంతంగా బయటకు పంపారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరికి ఓటు వేయాలో ఓటర్లు నిర్ణయించుకుంటారని, ఓటర్లు రాకపోయినా వేరే వారితో దొంగ ఓట్లు వేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. టిడిపి అక్రమాలు, దౌర్జన్యాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కెఎస్.లక్ష్మణరావు చీఫ్ ఎలక్షన్ ఏజెంటు రమేష్ మాట్లాడుతూ బుధవారం నుంచి దౌర్జన్యాలు జరుగుతున్నాయని, ఏజెంట్లుగా కూర్చొనివ్వకుండా పల్నాడులో టిడిపి వారు దౌర్జన్యాలు చేశారని తెలిపారు. మాచర్ల, చిలకలూరిపేట, బాపట్ల తదితర ప్రాంతాల్లో టిడిపి వారు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు.


ఓటు హక్కు వినియోగించుకున్న లోకేష్, చంద్రబాబు


ఓటు హక్కు వినియోగించుకున్న కె.ఎస్. లక్ష్మణరావు , ఆయన కుటుంబ సభ్యులు

ఓటమి భయంతో టిడిపి కూటమి రిగ్గింగ్

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యావంతులను, పట్టభద్రులను, చట్టసభలకు పంపించాలనే ఉద్దేశంతో శాసనమండలి వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా వీరిని ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పిస్తే ఈ ఎన్నికలను టిడిపి కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గురువారం పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని మున్సిపల్ హైస్కూలులో తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. మేధావులు, నిజాయితీ పరులు ఉండాల్సిన పట్టభద్రుల ఎన్నికలలో కూడా రాజకీయాలకు సంబంధించిన వ్యక్తులను శాసనమండలికి పంపిస్తూ కొత్త సంస్కృతికి తెరలేపారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా టిడిపి కార్యకర్తలను బూత్ ఏజెంట్లుగా నియమించి దొంగ ఓట్లు వేయించారని మండిపడ్డారు. నరసరావుపేట పట్టణంలో కొన్ని పోలింగ్ బూత్‌లలో దొంగ ఓట్లు వేస్తూ, మధ్యాహ్నం నుంచి పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకుని దొంగ ఓట్లువేశారని ఆరోపించారు. ఓటర్ల జాబితాను లోపభూయిష్టంగా తయారు చేసి విడుదల చేశారని, ఓటర్ల జాబితా కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారికి ఇవ్వలేదన్నారు. నరసరావుపేటలో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిగ్గింగ్‌ను నిలువరించాలని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, జిల్లా కలెక్టర్ స్పందించి వీరిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలను నిజాయితీగా నిష్పక్షితంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.


మీడియాతో మాట్లాడుతున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వ్యకాస కృష్ణా జిల్లా అధ్యక్షులు ప్రకాశరావు మృతి

ప్రజాశక్తి - చల్లపల్లి (కృష్ణా జిల్లా)

వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు, సిపిఎం తోట్లవల్లూరు, మొవ్వ మండలాల మాజీ కార్యదర్శి శీలం ప్రకాశరావు (50) గురువారం సాయంత్రం మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామం మొవ్వ తీసుకొచ్చారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య, ఒక కుమారుడు సిపిఎం సభ్యులుగా ఉన్నారు. గత 15 ఏళ్లుగా ప్రకాశరావు కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం మొవ్వ గ్రామం జెజె నగర్లో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.


శీలం ప్రకాశరావు

సిపిఎం సంతాపం

ప్రకాశరావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సమస్యలపై ఆయన అలుపెరుగని పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం నారాయణరావు, కోసూరు శివనాగేంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిపిఎం నాయకులు జుజ్జువరపు యోసేపు, కంభం కొండలు తదితరులు సంతాపం తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతు సంఘం సంతాపం

ప్రకాశరావు మృతికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించింది. గ్రామీణ ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసి వ్యవసాయ కార్మిక సంఘం పూర్తి కాలం కార్యకర్తగా వచ్చారని, సిపిఎం మండల కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేసింది. ప్రస్తుతం సంఘం జిల్లా అధ్యక్షులుగా ఉంటూ తీవ్రమైన అనారోగ్య కారణాలతో మృతి చెందడం బాధాకరమని పేర్కొంది. ప్రకాశరావు మృతికి ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లర్పించింది. ఆయనకు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.

స్మార్ట్ మీటర్లపై ఎపిఇఆర్‌సి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి ప్రయోజనమూ లేదని రుజువైందని, దీనివల్ల అదనపు ఖర్చు తప్ప రాష్ట్రానికి ఒరుగుతున్నదేమీ లేదని పేర్కొన్నారు. ఈ తతంగం మొత్తం రాష్ట్రప్రభుత్వం తప్పుడు విధానాలకు ఒక చట్టబద్ధమైన ఆమోదముద్ర వేసుకోవటానికే అని స్పష్టమవుతోందని తెలిపారు. ఎపిఇఆర్‌సి ప్రపంచబ్యాంకు ఒప్పందంలో భాగంగా ఏర్పాటు చేసిందని 20 ఏళ్ల క్రితం సిపిఎం దీన్ని వ్యతిరేకించిందని, అది సరైనదేనని ఆచరణలో రుజువైందని తెలిపారు. ఇప్పటికైనా ఎపిఇఆర్‌సి తన వైఖరి మార్చుకోవాలని సిపిఎం డిమాండు చేసింది.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం : ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1477వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు, పలు విభాగాల ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సింది పోయి ప్రయివేటీకరించడం దారుణమన్నారు. మోడీ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ చుట్టూ ఉన్న విలువైన భూములను కారు చౌకగా కొట్టేయడానికి కార్పొరేట్లు చూస్తున్నారన్నారు. కార్మికులకు, ఉక్కు నిర్వాసితులకు కేంద్రం అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించి, నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించే వరకూ పోరాటం కొనసాగుతుందని అన్నారు.

నేటి వరకు 'గ్రూప్-2'పై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-2 పరీక్షపై అభ్యంతరాలు స్వీకరణకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) గడువు మరో రోజు పొడిగించింది. ఈ మేరకు కమిషన్ ఇన్‌చార్జి కార్యదర్శి ఐ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం వరకే గడువు ఉన్న అభ్యంతరాల స్వీకరణను శుక్రవారం వరకు పొడిగించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు తెలపవచ్చని పేర్కొన్నారు.

కల్తీ నెయ్యి కేసు 3కు వాయిదా

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

కల్తీ నెయ్యి ఘటన కేసులో ఇరు పార్టీల వాదనలు విన్న తరువాత తిరుపతి రెండో అదనపు జడ్జి కోటేశ్వరరావు కేసును 3వ తేదీకి వాయిదా వేశారు. బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు విపిన్‌జైన్ (ఎ3), పొమిల్‌జైన్ (ఎ4) నిందితులు వేసిన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే అపూర్వ చావడ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్, సిట్ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను గురువారం వాదనలు విన్న జడ్జి పూర్తి వివరాలతో కోర్టుకు సోమవారం రావాలని వాయిదా వేశారు.

క్రషింగ్ సమస్యపై చెరకు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా చోడవరంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద రైతులు గురువారం ఆందోళనకు దిగారు. కొద్ది రోజులుగా క్రషింగ్ సజావుగా సాగకపోవడంతో చోడవరం మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్య తీరును నిరసిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. కొంతకాలంగా ఫ్యాక్టరీ క్రషింగ్ ఒక పూట ఆడడం, మరొక పూట ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎమ్‌డికి ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని ఆవేదన వెలిబుచ్చారు. చోడవరం సిఐ అప్పలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించిన ఆందోళనను కొనసాగించారు. ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు రాస్తారోకో వద్దకు చేరుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా శాంతించారు.



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు దిగిన చెరకు రైతులు

రైతులను ఇబ్బంది పెట్టడం తగదు : సిపిఎం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ విషయమై ఇటు ప్రభుత్వం, అటు యాజమాన్యం రైతులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ క్రషింగ్‌ను తరుచూ నిలిపివేస్తుండడంతో పశువులు, ట్రాక్టర్లతో వచ్చిన రైతులు ఫ్యాక్టరీ వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు.

రైతుల్లో ఆక్రోశం కట్టలు తెంచుకొని నేడు ఫ్యాక్టరీ గేటు వద్ద ఆందోళనకు దిగారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఫ్యాక్టరీకి పూర్వ వైభవం తెస్తానని చెప్పి నేడు పత్తా లేకుండా పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగంలో నడుస్తున్న సుగర్ ఫ్యాక్టరీల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని తెలిపారు. తక్షణమే గోవాడ సుగర్స్ రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నివాసయోగ్య పత్రం ఉంటేనే తాగునీరు, డ్రైనేజి, విద్యుత్ కనెక్షన్

- అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్సులు ఇవ్వొద్దు
- పట్టణాభివృద్ధిశాఖ కొత్త నిబంధనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణాలకు సంబంధించి పట్టణాభివృద్ధి శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీటిని విడుదల చేస్తున్నట్లు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. దీనిపై గురువారం ఆదేశాలు జారీచేశారు. అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ నివాసయోగ్య ధ్రువపత్రం ఉంటేనే తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని, బ్యాంకర్లు కూడా అప్పుడే రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలకు ట్రేడ్, బిజినెస్ లైసెన్సులు జారీచేయొద్దని సూచించారు. జోనల్ ప్లానులోనూ డీవియేషన్ లేకుండా నిర్మాణాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆక్యుపేషన్ సర్టిఫికెట్ భవన యజమానుల వద్ద అండర్‌టేకింగ్ తీసుకోవాలని, అది ఉంటేనే భవనాల్లోకి వచ్చేలా చూడాలని సూచించారు. నిర్మాణం పూర్తయ్యే వరకూ ప్లాను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు అధికారులు బిల్డింగ్ ప్లాను, నిర్మాణాన్ని తనిఖీ చేయాలని సూచించారు. డీవియేషన్ సరిచేసే వరకూ ఆక్యుపేషన్ సర్టిఫికెట్ ఇవ్వొద్దని, అలా జారీచేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జి ఉత్పత్తులకు అధిక ఆదాయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వయం సహాయక సంఘాల, రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పిఒ)ల సభ్యుల ఉత్పత్తులకు విలువ జోడించి అధిక ఆదాయం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామీణ పేదరిక నిర్మూలనశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని తన కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు, ఫాంవేద, మిల్లెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీస్, ఫ్లిప్ కార్డ్ సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులైన మహిళలు, వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారని, వాటికి విలువ జోడించి అత్యధిక ఆదాయం పొందేందుకు తగిన కార్యాచరణతో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా ఫాంవేద, మిలెట్ బ్యాంక్, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీసు, ఫ్లిఫ్ కార్టు ప్రతినిధులు రైతు ఉత్పత్తులకు విలువ జోడించి అధిక ఆదాయం పొందే మార్గాలను వివరించారు. ఈ అంశానికి సంబంధించి ఆయా సంస్థలతో ఎంఒయులు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో సెర్ప్ సిఇఒ కరుణ, డైరెక్టర్ పద్మావతి, ఐఎఎం బెంగళూరు ప్రొఫెసర్ త్రిలోచనాశాస్త్రి, మిల్లెట్ బ్యాంక్ సిఇఒ విశాల, క్యాపిటల్ మేనేజ్మెంట్ సర్వీసెస్ సిఇఒ రజని, డైరెక్టర్ హెచ్.ఎస్ విశ్వనాథ్, ఫ్లిప్‌కార్ట్ ప్రాజెక్ట్ హెచ్ దీపూ జ్యోషి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎపి సృజనాత్మకత, సంస్కృతి సమితి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'విశ్వవసు' నామ సంవత్సర ఉగాది వేడుకల్లో మార్చి 30న వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులకు, కవులకు ఉగాది పురస్కారాలు, కళారత్న పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎపి సృజనాత్మకత, సంస్కృతి సమితి కోరింది. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేసింది. ఉగాది పురస్కారాల విభాగంలో సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, వైద్యం, ఇంద్రజాలం, మూకాభినయం, హరికథ, జర్నలిజం, సామాజిక సేవ, కమిటీ సిఫార్సు చేసిన ఇతర రంగాలలో, కళారత్న పురస్కారాల విభాగంలో సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానంలో పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొంది. దరఖాస్తుదారులు వారి వివరాలతో కూడిన బయోడేటాను మార్చి 15వ తేదీలోపు సిఇఒ ఎపి రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, 2వ అంతస్తు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల, దుర్గాపురం, విజయవాడ - 520 003 చిరునామాకు పంపాలని కోరింది. apculture.ugadi2025@gmail.com అనే మెయిల్ అడ్రస్‌కు మెయిల్ చేయవచ్చని తెలిపింది. గతంలో పద్మ, సంగీత, నాటక, కేంద్ర సాహిత్య అకాడమీ, కేంద్ర ప్రభుత్వ అవార్డులు, కళారత్న పురస్కారాలు పొందిన వారి దరఖాస్తులు పరిశీలించబడవని ప్రకటించింది.



విలేకరులతో మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

- వక్ఫ్‌బోర్డ్ రాష్ట్ర చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు చర్యలు చేపడతామని ఎపి స్టేట్ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం కర్నూల్ నగరంలోని ఉస్మానియా కాలేజ్ రోడ్డులో ఉన్న ఉమర్ అరబిక్ పాఠశాల ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ఎవరైనా ఈ భూములను కొనుగోలు చేసి ఉంటే వక్ఫ్‌బోర్డుకి తిరిగి ఇవ్వాలని కోరారు. పూర్వకాలంలో పెద్దలు ముందుగానే ఆలోచించి కేవలం చదువు మాత్రమే సమాజంలో సమానత్వం తీసుకురాగలదని భావించి 102 సంవత్సరాల కిందటే ఉమర్ అరబిక్ పాఠశాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు.

మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌కు 41-ఎ నోటీసులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హిందూపురం మాజీ ఎంపి, వైసిపి నాయకులు గోరంట్ల మాధవ్‌కు విజయవాడ పోలీసులు 41-ఎ కింద గురువారం నోటీసులు అందజేశారు. ఓ ఇంటర్వ్యూలో పోక్సో కేసులో బాధితురాలి పేరును బహిరంగ పరిచారన్న కారణంతో మాజీ మహిళా హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ 2024లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా గోరంట్ల మాధవ్‌కు అనంతపురంలోని ఆయన నివాసంలో నోటీసులు అందజేశారు. ఈ కేసు నిమిత్తం మార్చి 5న సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్, అనితపైనా కేసులు పెట్టాలి : గోరంట్ల మాధవ్

అత్యాచారానికి గురైన బాధితుల పేర్లు బహిర్గతం చేశానని తనకు నోటీసులు ఇచ్చారని గోరంట్ల మాధవ్ తెలిపారు. పోలీసుల నోటీసులు అందుకున్న అనంతరం అనంతపురంలోని ఆయన నివాసం వద్ద. మీడియాతో మాట్లాడుతూ బాధితుల పేర్లు ప్రస్తావించిన వారిలో జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత కూడా ఉన్నారని తెలిపారు. తనతోపాటు వారిపైనా కేసులు నమోదు చేయాలని కోరారు. అత్యాచారానికి గురైన బాధితుల పేర్లు బహిర్గతం కానంత వరకు ప్రస్తావించకూడదని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో పేర్లు అప్పటికే వెల్లడయ్యాయని చెప్పారు. ఆ తరువాతే తాను ప్రస్తావించానని పేర్కొన్నారు. ఇటువంటి కేసులతో వైసిపి నాయకులను భయపెట్టలేరని తెలిపారు.

అంధ యువతికి సిఎం రూ.5 లక్షల సాయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తన వివాహానికి సాయం కోరిన అంధ యువతికి సిఎం చంద్రబాబునాయుడు రూ.5 లక్షల సాయం అందించారు. కుప్పం మండలం రాళ్ల బుదుగూరుకు చెందిన ఆర్.నాగమణి దేవుడి అంధురాలు. ఎంఎ వరకూ చదువుకున్న ఆమెకు కుటుంబ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వివాహం కష్టంగా మారింది. శాంతిపురం మండల వెంకటాపురానికి చెందిన యువకుడు భూపతి పెళ్లి చేసుకునేందుకు ముందుకు వచ్చాడు. ఇటీవల నాగమణి భూపతితో కలిసి సిఎంను సాయం అడిగింది. స్పందించిన సిఎం వివాహ ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు ప్రకటించారు. బుధవారం వారికి సిఎం చెక్కు అందజేశారు. కాబోయే దంపతులకు సిఎం వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

తెలియదు.. గుర్తులేదు.. అవునా?

- పోలీసుల విచారణలో పోసాని
- ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లోనే పోసానికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (అన్నమయ్య జిల్లా)

వైసిపి నేత, సినీ నటుడు పోసాని కృష్ణమురళిని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌కు గురువారం తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మై హోమ్ భూజా అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పోసానికి వైద్య పరీక్షల అనంతరం ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారించారు. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా తెలియదు, గుర్తులేదు, అవునా? అంటూ సమాధానాలు దాటవేశారని తెలిసింది. రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరిస్తే పోసాని తరపున వాదనలు వినిపించేందుకు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రైల్వేకోడూరులోనే ఉన్నారు. పోలీసుస్టేషన్‌లో పోసానిని కలుస్తామని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ శ్రేణులు పట్టుపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోసాని తరపున వచ్చిన న్యాయవాదులను సైతం అనుమతించలేదు. పోసానిని కలిసేందుకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన తరపు న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేస్తామని తెలిపారు. పోలీసు స్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలూ లేవని నిర్ధారించారు. కాగా, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రూపుల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బిఎన్‌ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది.



ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ వద్ద పోసాని

పోసాని సతీమణికి జగన్ పరామర్శ

సినీనటుడు, వైసిపి నాయకుడు పోసాని కృష్ణమురళీ అరెస్టును మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఖండించారు. పోసాని భార్య కుసుమలతను ఫోన్‌లో పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాష్ట్రంలో టిడిపి కూటమి పాలన నిరంకుశంగా సాగుతోందని అన్నారు. జరుగుతున్న వ్యవహారాలను ప్రజలు చూస్తున్నారని, కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. పార్టీ తరుపున న్యాయపరంగా సాయం అందిస్తామని, ఇప్పటికే పార్టీకి సంబంధించిన సీనియర్ న్యాయవాదులకు ఈ వ్యవహారాన్ని అప్పగించామని వివరించారు.

విదేశీ పర్యటనలకు రూపాయి పోటు

- 20 శాతం అదనపు వ్యయం

న్యూఢిల్లీ : సరదాగా విదేశాలను చుట్టిరావాలనకుంటున్న ఎగువ మధ్యతరగతి, ధనవంతుల ఆశలపై రూపాయి పతనం ప్రభావం చూపుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో వరుసగా పడిపోతున్న రూపాయి విలువతో భారతీయుల విదేశీ పర్యటనలపై భారం పడుతోంది. రూపాయి బక్కచిక్కడం, అంతర్జాతీయంగా డాలర్‌కు డిమాండ్ పెరగడంతో ఈ ఏడాది వేసవిలో భారతీయుల అంతర్జాతీయ సెలవులను మరింత ఖరీదైనవిగా మార్చుతున్నాయని పర్యాటక పరిశ్రమ వర్గాలు తెలిపాయి. టూర్ ఆపరేటర్లు ధరల పెంపును ప్రయాణికులకు బదిలీ చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్-జూన్ కాలానికి గత సంవత్సరంతో పోల్చితే 15-20 శాతం విదేశీ పర్యటనలు భారం అవుతున్నాయి.

ముఖ్యంగా యూరోపియన్ గమ్యస్థానాలకు, ఆగ్నేయాసియా దేశాలకు దీని ప్రభావం ఎక్కువగా ఉందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఎటిఒ) ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా పేర్కొన్నారు. ప్రస్తుతం 15-20 శాతం వ్యయాలు పెరగొచ్చన్నారు. అంతర్జాతీయ ప్యాకేజీల్లో 2017-2018, 2018-19లోనూ రూపాయి పతనంతో ఇదే తరహాలో వ్యయాలు పెరిగాయన్నారు. "డాలర్ ఖరీదైనందున టూర్ ప్యాకేజీల ధర పెరిగింది. అంతేకాకుండా భారత్‌లోని హిల్ స్టేషన్లలో భారీ రద్దీ దేశీయ విమాన ప్రయాణాలను, హోటళ్ల ఛార్జీలను భారంగా మారుస్తుంది. దేశీయంగా అధిక ధరలు ఉండటంతో ప్రజలు విదేశీ గమ్యస్థానాల వైపు చూస్తున్నారు," అని రాజీవ్ పేర్కొన్నారు. భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు అనేక దేశాలు ఉచిత ఈ-వీసాల ప్రకటనలు జారీ చేసి ఆసక్తిని పెంచుతున్నాయన్నారు. మంగళవారం సెషన్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 51 పైసలు క్షీణించి 87.2కు పడిపోయింది. ఫిబ్రవరి 10న ఏకంగా 87.95 పతనమై.. ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. దీంతో సరుకుల దిగుమతులు భారం కావడంతో.. భారత విదేశీ అప్పు చెల్లింపులు భారం అవుతున్నాయి. విదేశాల్లోని విద్యార్థుల చదువులకు అధికంగా చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



ముగిసిన వంశీ పోలీసు కస్టడీ

- సత్యవర్ధన్‌కు నార్కో టెస్ట్ చేయిస్తే నిజాలు బయటకొస్తాయి : వంశీ

ప్రజాశక్తి - విజయవాడ

వైసిపి నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మూడు రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో గురువారం విజయవాడ జిల్లా కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ వద్ద వంశీ కీలక వ్యాఖ్యలు చేశారు. సత్యవర్ధన్‌కు నార్కో అనాలసిస్ పరీక్షలు నిర్వహిస్తే ఈ కేసులో అసలు నిజాలు బయటకొస్తాయని తెలిపారు. తనను కేసుతో సంబంధం లేని ప్రశ్నలు అడిగారని న్యాయమూర్తికి వివరించారు. జైలులోని సెల్‌లో తనను ఒంటరిగా ఉంచారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. తనకు ఆస్తమా సమస్య ఉందని, ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఇబ్బంది అని తెలిపారు. తనతో పాటు సెల్‌లో మరొకరిని ఉంచాలని కోరారు. వంశీ విజ్ఞప్తిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. "ఇప్పటికే వంశీకి దగ్గరలో అటెండర్ సౌకర్యం కల్పించారు కదా?" అని ప్రశ్నించారు. వంశీ భద్రత దృష్ట్యా సెల్‌లో ఒంటరిగా ఉంచామని జైలు అధికారులు వివరణ ఇచ్చారు. ఆరోగ్య పరిశీలనకు వార్డెన్‌ను ఏర్పాటు చేసేందుకు తమకు అభ్యంతరం లేదని చెప్పారు. దీంతో వంశీ సెల్ వద్ద వార్డెన్‌ను ఉంచాలని జైలు అధికారులకు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. కస్టడీలో వంశీతోపాటు మరో ఇద్దరు నిందితులు లక్ష్మీపతి, శివరామకష్ణను పోలీసులు విచారించారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ప్రమేయం ఉన్నవారిపై ఆరా తీసినట్లు తెలిసింది. విచారణలో తనకేమీ తెలియదని వంశీ పదేపదే చెప్పినట్లు సమాచారం. మరోసారి వంశీతోపాటు ఇతర నిందితులను కస్టడీకి తీసుకుని విచారించాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలిసింది.

వంశీపై మరో కేసు


వంశీపై పోలీసులు మరో కేసు నమోదైంది. ఇప్పటికే గన్నవరం నియోజకవర్గంలోని పలు స్టేషన్లలో మూడు కేసులు నమోదు కాగా.. తాజాగా మరో కేసు పెట్టారు. పోలీసులు కథనం ప్రకారం.. గన్నవరం శివారు మర్లపాలెంలో సుమారు 18 ఎకరాల్లో పానకాల చెరువు ఉంది. ఆ చెరువులోని కొంత భాగాన్ని 15 మంది గ్రామస్తులు గత 40 ఏళ్లుగా సాగు చేసు కుంటున్నారు. 2023లో అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న వల్లభనేని వంశీ, తన అనుచరులతో కలిసి భూములను ఖాళీ చేయాలని రైతులపై ఒత్తిడి చేసి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆ తర్వాత ప్రజల ఉపయోగం కోసం చెరువును అభివద్ధి చేస్తామంటూ ఆ భూమిని స్వాధీనం చేసుకొని.. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరిపి అమ్ముకున్నారు. చెరువు భూమికి ప్రత్యామ్నాయం గా రైతులకు వేరే చోట భూమి ఇస్తామని తొలుత చెప్పి.. తర్వాత దగా చేశారని పోలీసులు తెలిపారు. దీనిపై మర్లపాలెం గ్రామానికి చెందిన జాస్తి మురళీకష్ణ మంగళవారం రాత్రి గన్నవరం పోలీసులను ఆశ్రయించారని, ఆయన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీ, అనగాని రవి, రంగా, శేషు, మేచినేని బాబుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

చిన్న వ్యాపారాల్లో 27 శాతం మంది మహిళలు : గోడాడీ వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలోని చిన్న వ్యాపారలల్లో పావు వంతు లేదా 27 శాతం కంటే ఎక్కువ మంది మహిళలు ప్రధాన పాత్ర పోశిస్తున్నారని ప్రముఖ డొమైన్ కల్పన సంస్థ గోడాడీ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఇందులో 74 శాతం మంది గడిచిన ఐదేళ్లలోనే వ్యాపారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. గోడాడీ 2025 గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సర్వే ప్రకారం.. 90 శాతం మంది మహిళలు తమ సామర్థ్యంపై విశ్వాసం వ్యక్తం చేశారు. పెద్ద కంపెనీలతో పోటీపడాలంటే ఎఐ సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే 3-5 ఏళ్లలో తమ వ్యాపార వృద్ధిపై 81 శాతం మంది ఆశాభావం వ్యక్తం చేశారు.

పిఎంఒకు ఇన్ఫోసీస్ ట్రైనీ ఉద్యోగుల ఫిర్యాదు..!

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద టెక్ కంపెనీ ఇన్ఫోసిస్ ఇటీవల శిక్షణ పొందుతున్న 400 మంది ట్రైనీలను అనుహ్యంగా తొలగించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తమను అన్యాయంగా తొలగించారని ట్రైనీ ఉద్యోగులు ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ)కు ఫిర్యాదు చేశారని రిపోర్టులు వస్తోన్నాయి. కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ఉద్వాసన పలకగా.. అందులో దాదాపు 100 మంది పైగా పిఎంఒకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. ఈ అంశంలో జోక్యం చేసుకొని తమ ఉద్యోగాలు తిరిగి ఇప్పించాలంటూ ట్రైనీలు కోరినట్లు తెలిసింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఆ సంస్థపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారని సమాచారం. ఫిబ్రవరి 7ప ట్రైనీలను 50 మందితో కూడిన బ్యాచ్‌లుగా పిలిచి వారితో మ్యూచువల్ సెపరేషన్ లెటర్లపై సంతకాలు చేయించుకుంది. సాయంత్రం 6 గంటల్లోపు 400 ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని ఆదేశాలు జారీ చేసింది. ఏకంగా పలువురిని బౌన్సర్లను ఉపయోగించి బయట నెట్టించారనే ఆరోపణలు వచ్చాయి.

విత్తయేతర కంపెనీల ఆదాయాల్లో వృద్ధి : ఆర్‌బిఐ

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్రయివేటు రంగంలోని ఆర్థికేతర లిస్టెడ్ కంపెనల ఆదాయాల్లో 8 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఆర్‌బిఐ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే సమయంలో 5.5 శాతం పెరుగుదల మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. 2024 జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో 5.4 శాతం వృద్ధి చోటు చేసుకుందని వెల్లడించింది.

గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో ప్రయివేటు కార్పొరేట్ రంగం పనితీరుపై 2,924 ఆర్థికేతర లిస్టెడ్ కంపెనీల సంక్షిప్త త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా ఆర్‌బిఐ నివేదిక రూపొందించింది. ఆటోమొబైల్స్, రసాయనాలు, ఆహార ఉత్పత్తులు, విద్యుత్ యంత్రాల పరిశ్రమలలో అధిక అమ్మకాల వల్ల కారణంగా 1,675 లిస్టెడ్ ప్రయివేటు తయారీ కంపెనీల ఆదాయాల్లో 7.7 శాతం పెరుగుదల ఉంది.

మార్కెట్లోకి డిప్లోస్ మాక్స్ ఇ-స్కూటర్ విడుదల

- తెలుగు రాష్ట్రాల్లో 40 డీలర్‌షిప్‌లను తెరుస్తాం
- న్యూమెరస్ మోటార్స్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

న్యూమెరస్ మోటార్స్ తన విక్రయాలను తెలుగు రాష్ట్రాలకు విస్తరించింది. ఈ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ తమ మల్టీయుటిలిటీ ఇ-స్కూటర్, డిప్లోస్ మాక్స్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో దీన్ని న్యూమెరస్ ఇండియా ఇంజీనిరింగ్ వైస్ ప్రెసిడెంట్ సౌందరరాజన్ ఆవిష్కరించారు. 2026 మార్చి ముగింపు నాటికి తెలుగు రాష్ట్రాల్లో 40 డీలర్‌షిప్‌లకు విస్తరించనున్నట్లు సౌందరరాజన్ మీడియాతో వెల్లడించారు. ప్రస్తుతం ఎపి, తెలంగాణలో మూడు అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా 40 డీలర్‌షిప్‌లను కలిగి ఉన్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి 170 అవుట్‌లెట్‌లకు విస్తరించనున్నామని చెప్పారు. నాలుగేళ్ల పలు పరీక్షల తర్వాత డిప్లోస్ మ్యాక్స్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. వచ్చే జూన్‌లో మరో క్రాస్‌ఓవర్‌ను విడుదల చేయడానికి కసరత్తు జరుగుతోందన్నారు. 2027లో ఇవి త్రిచక్ర వాహనాన్ని అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డిప్లోస్ మాక్స్ హైదరాబాద్ ఎక్స్‌షోరూం ధరను



రూ.1,12,199గా నిర్ణయించామన్నారు. ఇందులో రెండు బ్యాటరీలను ఉపయోగించామన్నారు. ఒక్క సారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్ల మేర ప్రయాణించవచ్చన్నారు.

సంపాదకీయం

'కుంభమేళా' రాజకీయం!

నలభై ఐదు రోజుల పాటు జరిగిన మహా కుంభమేళా జనవరి 13న మొదలై, ఫిబ్రవరి 26 బుధవారంతో ముగిసింది. 66.21 కోట్ల మంది స్నానాలు ఆచరించారని, రూ.3 లక్షల కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. కుంభమేళా ఏర్పాట్లలో ఏదైనా అసౌకర్యం జరిగి ఉంటే తమను క్షమించాలని ప్రధాని నరేంద్రమోడీ ఎక్స్ వేదికగా భక్తులను కోరారు. కనీవినీ ఎరగని విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ ప్రచారం చేయడం, సంఘ్ పరివారం ప్రత్యేక దృష్టి పెట్టి కదిలించటం తదితర కారణాల వల్ల ఈసారి పెద్దసంఖ్యలో జనం కుంభమేళాలో పాల్గొన్నారు. ప్రచారం చేసినంత స్థాయిలో జాగ్రత్తలు, ఏర్పాట్లూ లేకపోవడం వల్ల ప్రయాగరాజ్‌లోనూ, ఢిల్లీలోనూ తొక్కిసలాటలు జరిగి 48 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలు, అగ్నిప్రమాదాలు, చిన్న చిన్న తొక్కిసలాటలు, గంటల తరబడి ట్రాఫిక్ రద్దీలు వంటి ఇబ్బందులు అనేకం చోటు చేసుకున్నాయి. ఏర్పాట్లలో విఐపిలకు ఇచ్చినంత ప్రాధాన్యం సామాన్య భక్తులకు ఇవ్వలేదని మొదటి రోజు నుంచీ విమర్శలు వచ్చాయి.

సాధారణంగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనే సామాన్య భక్తులు తమ సందర్శన ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతతను, సాంత్వనను ఆశిస్తారు. తమ విశ్వాసానికి తగ్గట్టుగా పూజాదిక విధులు నిర్వహించి, సంతృప్తి చెందుతారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలక్కుండా తగిన ఏర్పాట్లు చేయడం, అన్ని విధాలా భద్రత కల్పించటం పాలకుల విధి. ఆదిత్యనాథ్ ప్రభుత్వం రూ. 7 వేల కోట్లు వెచ్చించి, ఏర్పాట్లు చేసింది. ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, సెలబ్రిటీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రముఖులు ఎవరు వచ్చినా ఆ వార్తలను విపరీత ప్రచారంలో పెట్టింది. కోట్లాదిమందితో నదీతీరం, క్షేత్రాలూ కిక్కిరిసిపోతున్నా; వందల కిలోమీటర్ల మేర రహదారులు స్తంభించిపోయినా ప్రకటనలు హోరెత్తించింది. 'పెద్ద సంఖ్యలో' సమీకరించటంపై చూపిన శ్రద్ధాసక్తులు జనం పడే ఇబ్బందులపై ఇసుమంత కూడా కనపరచలేదు. అవకాశానికి మించినంత జనం వస్తున్నా - తగిన జాగ్రత్తలు తీసుకోని ఫలితమే ఢిల్లీ రైల్వేస్టేషన్‌లోని తొక్కిసలాట అని స్పష్టమైంది. ప్రజల కన్నా ప్రచారమూ, రాజకీయ ప్రయోజనమూ ముఖ్యమన్న ధోరణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెంటి వద్దా వ్యక్తం కావటం విచారకరం.

మొదటి తొక్కిసలాటలో భక్తులు చనిపోతే ఎంతమంది చనిపోయారో, ఎంతమంది గాయపడ్డారో 14 గంటల వరకూ సమాచారం బయటికి రాలేదు. కానీ, ఏరోజుకు ఆరోజు ఎంతమంది స్నానాలు ఆచరించారో ఠంచనుగా లెక్కలు విడుదల చేశారు. ఇంత పెద్ద కార్యక్రమంలో తొక్కిసలాట మామూలేనంటూ ఆ రాష్ట్రమంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. నదీజలం తీవ్రంగా కలుషితమైందని, ప్రమాదకరమైన బ్యాక్టీరియాతో నిండిపోయిందని సాక్షాత్తూ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ పరిశోధనపూర్వక నివేదికను వెల్లడిస్తే- అదంతా తప్పన్నట్టు ముఖ్యమంత్రి యోగి కొట్టిపారేశారు. నదీజలం స్నానానికే కాదు; తాగటానికి కూడా స్వచ్ఛంగా ఉందంటూ ఉద్ఘోషించారు. కుంభమేళాలో స్నానమాచరించని రాహూల్‌గాంధీ, ఉద్ధవ్ థాకరేకి హిందువులు ఓట్లు వేయరాదంటూ కేంద్రమంత్రి రాందాస్ అథవాలే అథమస్థాయి వ్యాఖ్యలు చేశారు. నోట్లరద్దుతో క్యూలో నిల్చొని జనం ప్రాణాలు వదిలినప్పుడు, ఆకస్మిక లాక్‌డౌన్‌తో కోట్లాదిమంది కార్మికులు నానా ఇక్కట్లూ పడినప్పుడు, రోడ్లపై నడుస్తూనే ప్రాణాలు కోల్పోయినప్పుడు, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, హత్యాచారాలకు పాల్పడినప్పుడు నోరు విప్పని, క్షమాపణ కోరని ప్రధాని మోడీ ... కుంభమేళాలో జరిగిన అసౌకర్యాలకు చింతిస్తూ, క్షమాపణలు కోరారు. ఇదంతా దేనిని సూచిస్తోంది? భక్తుల విశ్వాసాలను రాజకీయ లబ్ధిగా మార్చుకునే బిజెపి కుటిల, కుత్సిత, స్వార్థబుద్ధిని బయట పెడుతోంది. ప్రజలను మతం పేరిట విడదీసి, పబ్బం గడుపుకునే ఏహ్యమైన పాచిక కనపడుతోంది. దైనందిన బతుకులో భారాలకు, సమస్యలకు కారణమవుతూ, మతవిశ్వాసాలు, ఉద్వేగాల హంగామాతో దానిని మభ్యపెట్టాలని పాలకుల పన్నాగం. ప్రజలు దానిని అర్థం చేసుకోలేరనుకుంటే అది అజ్ఞానమే అవుతుంది.

మహనీయుల మాట



రూసో మహాశయుని రచన 'సోషల్ కాంట్రాక్ట్' కన్నా, అమెరికా రాజ్యాంగం 'బిల్ ఆఫ్ రైట్స్' కన్నా, 'మనిషి, పౌరుని హక్కులు' గురించిన ఫ్రెంచి ప్రకటన కన్నా...మరే ఇతర రాజకీయ రచన కన్నా కూడా... ఆధునిక ప్రపంచపు ఆచరణాయుత రూపకల్పనలో 'కమ్యూనిస్టు ప్రణాళిక' ప్రభావం చాలా ఎక్కువ. ఇందుకు మొదటి కారణం అందులో వున్న రాజకీయ సందేశమే.

- ఐజాజ్ అహ్మద్,
మార్క్సిస్టు తత్వవేత్త.

రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు

విశ్లేషణ



వి. రాంభూపాల్

రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో అభివృద్ధి సాధించాలి. రాష్ట్రంలో ఇప్పటికీ అత్యధిక మంది గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నందున వ్యవసాయ అభివృద్ధి రాష్ట్రాభివృద్ధిలో కీలకం. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితి ఏడాదికేడాది దిగజారిపోతున్నది. ఈ స్థితి నుండి వ్యవసాయాన్ని, గ్రామీణ ప్రజల జీవితాన్ని తద్వారా రాష్ట్రాభివృద్ధిని సాధించాలంటే సాగునీటి వనరుల అభివృద్ధికి పాలకులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం, అందుబాటులో వున్న నీటి నిర్వహణకు పంటకాల్వలు నిర్మించడంతోపాటు, ప్రస్తుత ప్రాజెక్టు మరమ్మతులకు, నిర్వహణకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించాలి. మాటల గారడీలు కాకుండా నిధులను కేటాయించడం, కేటాయించిన వాటిని సకాలంలో ఖర్చు చేసి సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలి. రాష్ట్ర పునర్విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 1,62,970 చ.కి.మీ భౌగోళిక విస్తీర్ణంతో దేశంలో 8వ అతిపెద్ద రాష్ట్రంగా వుంది. 974 కిలోమీటర్ల పొడవు తీర ప్రాంతంతో దేశంలో అతి పెద్ద సముద్రతీర రేఖ కలిగిన రెండో రాష్ట్రంగా వున్నాము.

మన రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు 2,11,84,787 ఎకరాల భూమి అనువుగా వుంది. ప్రస్తుతం సాగు అవుతున్నది మాత్రం 1,49,44,910 ఎకరాలు. ఇప్పటివరకు పూర్తయిన భారీ ప్రాజెక్టుల ద్వారా 50,76,074 ఎకరాలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 6,09,288 ఎకరాలు, చిన్న తరహా ప్రాజెక్టుల ద్వారా 26,14,250 ఎకరాలు మొత్తం 82,99,612 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అంటే మొత్తం సాగుభూమిలో 55.5 శాతం భూమికి మాత్రమే సాగునీటి వసతి వుంది. ఇందులో చెరువులు, కుంటల కింద సాగు నికరంగా ఉండదు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల సాగుభూమిలో పది శాతం భూమికి కూడా సాగునీటి వసతి లేదు. శతాబ్దాలుగా వెనుకబడిన ఈ ప్రాంతాలకు ప్రత్యేక శ్రద్ధ ద్వారా సాగునీటి వనరుల అభివృద్ధి కల్పించాలి. అందుకు ఈ బడ్జెట్ ప్రాతిపదికగా వుండాలి.



వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, గేట్లు తెగిపోతున్న తుంగభద్ర డ్యాం నిర్వహణకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించాలి. హంద్రీనీవా ఆయకట్టు భూములకు నీరు ఇచ్చేందుకు పంట కాల్వల ఏర్పాటుకు, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలి. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నిర్వాసితులు అవుతున్న వారికి పునరావాసం, నష్టపరిహారం చెల్లించడానికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు వున్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి అవుతుంది. అలా లేకపోతే మరోసారి ఎండమావులతో ప్రజలను ఊరించడమే అవుతుంది.

ప్రస్తుత సాగునీటి వనరులు- సాగు విస్తీర్ణం

మన రాష్ట్రంలోని ఐదు ప్రధాన నదుల నుండి (గోదావరి ద్వారా 784.000 టిఎంసిలు, కృష్ణా-609.000, పెన్నా-93.000, వంశధార-46.000, నాగవళి ద్వారా 22.000 టిఎంసిలు) 1554 టిఎంసిల నీరు మనకు లభ్యమవుతుంది. ఈ నీటిలో 1476.109 టిఎంసిల నీటిని నిలుపుకునే సామర్థ్యం కలిగిన ఏర్పాట్లు ఉన్నాయి. ఇంకా 78 టిఎంసిల నికర జలాలను నిల్వ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. ఇవి కాకుండా వర్షపు జలాలు సుమారు 776.715 టిఎంసిలు అందుబాటులో ఉండగా, ఇప్పటికీ వినియోగిస్తున్నది 278.751 టిఎంసిలు మాత్రమే. అనగా ఇంకా 497.964 టిఎంసిల నీరు వినియోగించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంది. 355 టిఎంసిల భూగర్భ జలాలు వున్నాయి. ఇందులో 245 టిఎంసిల నీటిని 7,76,517 బోరుబావుల ద్వారా వినియోగిస్తున్నాము. అందుబాటులో ఉన్న నీటిని సంపూర్తిగా వినియోగించుకుంటే మరో 68 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించవచ్చు.

కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల ద్వారా మన రాష్ట్రం వినియోగించుకోవడానికి వీలున్న నికర జలాలు (75శాతం ఆధారంగా) 1554 టిఎంసిలు. ఇందులో నిర్మాణం పూర్తయిన భారీ ప్రాజెక్టుల ద్వారా 821.523 టిఎంసిలు, మధ్యతరహా ప్రాజెక్టుల ద్వారా 58.116, చిన్నతరహా ప్రాజెక్టుల ద్వారా 267.280 టిఎంసిలు మొత్తం 1146.919 టిఎంసిల నీటిని మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాం. అనగా ఇంకో 407 టిఎంసిల నికర జలాలను ఏ ఆటంకాలు లేకుండా వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. దానికి అవసరమైన కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ప్రస్తుత ప్రాజెక్టుల సామర్థ్యం పెంచితే అదనంగా కనీసం 40 లక్షల ఎకరాలకు ఆరుతడి పంటలకు సాగునీరు అందించడానికి అవకాశం ఉంది. అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని వున్నట్లు సాగునీటి వనరులకు అందుబాటులో ఇన్ని అవకాశాలు వుంటే పాలకులు వీటిని కాదని కొత్త ప్రాజెక్టుల శంకుస్థాపనలు, పొరుగు రాష్ట్రాలతో వివాదాలతో కాలం గడిపేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు

2014-15 నుండి 2018-19 సంవత్సరాల మధ్య కాలంలో 56 సాగునీటి ప్రాజెక్టులకు (పోలవరంతో కలిపి) ప్రభుత్వం రూ.80,792 కోట్లు కేటాయించి రూ.56,894 కోట్లు ఖర్చు చేసింది. అయితే వీటిలో ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తికాలేదు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను ఎంపిక చేసుకొని దశలవారిగా పూర్తిచేయాలని చాలకాలంగా సిపిఎం, అలాగే నీటిరంగ నిపుణులు సూచిస్తున్నా పాలకుల చెవికి ఎక్కడంలేదు. గత వైసిపి ప్రభుత్వం నూతనంగా 37 ప్రాజెక్టులను ఒకేసారి ప్రారంభించి 4 సంవత్సరాల్లో పూర్తిచేస్తామని ప్రకటించి ఒక్కటీ పూర్తి చేయలేదు. అసంపూర్తిగా వున్న లేదా నిర్మాణంలో వున్న ప్రాజెక్టులు పూర్తి చేయగలిగితే 54,35,684 ఎకరాలకు సాగునీరు అందించవచ్చు.

ప్రాజెక్టుల నిర్మాణ ఆలస్యం వల్ల పెరుగుతున్న ఖర్చులు

ప్రకటించిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడంవల్ల రెండు సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఒకటి పంట పొలాలకు సాగునీరు అందకపోవడం, రెండు నిర్మాణ ఖర్చులు భారీగా పెరగడం. జగన్‌మోహన్‌రెడ్డి 2019 మార్చి 31న రాష్ట్ర ప్రాజెక్టులపై సమీక్షించారు. తెలుగుగంగ, గాలేరు, నగరి, హంద్రీ-నీవా, శ్రీశైలం కుడికాలువ, పూల సుబ్బయ్య వెలిగొండ, గుండ్లకమ్మ, వంశధార-2 (1,2), తోటపల్లి బ్యారేజి, చింతలపూడి లిఫ్ట్‌లకు కలిపి ప్రారంభ అంచనాల మొత్తం రూ.13,614 కోట్లు. 2019 మార్చి 31 నాటికి ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి పెరిగిన అంచనా రూ.47,673 కోట్లు. ఇదే తేదీ నాటికి ఖర్చు చేసిన మొత్తం రూ.36,597 కోట్లు. ఇన్ని వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి కాలేదు? సాగు నీటి ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల కోసం, పాలకుల కమీషన్ల కోసం తప్ప తమ కోసం కాదని అనుభవం నుండి రైతులు గుర్తించగలుగుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులను పూర్తి చేయడం కాకుండా, బెనకచెర్ల-గోదావరి అనుసంధానం గురించి మాట్లాడుతున్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేదని ప్రాజెక్టుల మరమ్మతులకు, నిర్వహణకు నిధులు ఇవ్వనివారు రూ.80,000 కోట్లతో బెనకచెర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడడం మరోసారి రైతులను దగా చేయడమే.

రాష్ట్రం మొత్తం మీద మైనర్ ఇరిగేషన్ కింద చెరువులు, కుంటలు 34,147 ఉన్నాయి. వీటి కింద సుమారు 26,72,302 ఎకరాల సాగుభూమి ఉంది. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో చెరువులు, కుంటలు అత్యధికంగా ఉన్నాయి. రాయలసీమ నాలుగు జిల్లాలలో 13,098 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిని సక్రమంగా వినియోగించుకోవడం వల్ల ఈ ప్రాంతంలో 10 లక్షల ఎకరాలకు కనీస నీటి వసతి కలిపించవచ్చు. రాజుల కాలం నాడు నిర్మించిన ఈ చెరువులు, కుంటల పరిస్థితి దయనీయంగా ఉంది.


ప్రాజెక్టుల నిర్మాణానికి నిధుల కేటాయింపులు-ఖర్చులు

సాగునీటి ప్రాజెక్టులను ప్రకటించగానే పూర్తికావు. వాటి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించి, వాటిని సకాలంలో ఖర్చు చేయాలి. రాష్ట్ర విభజన తర్వాత గత తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులకు, ఖర్చు చేసిన దానికి చాలా వ్యత్యాసం వుంది. 2014-15 నుండి 2018-19 మధ్య గత తెలుగుదేశం ప్రభుత్వం రూ. 80,792 కోట్లు కేటాయించి, రూ.56,894 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వైసిపి ప్రభుత్వం 2019-20 నుండి 2023-24 మధ్య రూ.61,573.15 కేటాయించి, కేవలం రూ.32,059,61 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, గేట్లు తెగిపోతున్న తుంగభద్ర డ్యాం నిర్వహణకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించాలి. హంద్రీనీవా ఆయకట్టు భూములకు నీరు ఇచ్చేందుకు పంట కాల్వల ఏర్పాటుకు, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలి. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల నిర్వాసితులు అవుతున్న వారికి పునరావాసం, నష్టపరిహారం చెల్లించడానికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు వున్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి అవుతుంది. అలా లేకపోతే మరోసారి ఎండమావులతో ప్రజలను ఊరించడమే అవుతుంది.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

మాట మార్చుతున్న ట్రంప్!

వ్యాఖ్య



జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే డోనాల్డ్ ట్రంప్ మాటలు మారుతున్నాయి. అలాంటి వారు మడమ తిప్పటమే తరువాయి. సహజంగానే వ్యాపారి అయిన ఆ పెద్దమనిషి తనదైన శైలిలో అందరితో బేరసారాలాడు తున్నాడు. బిస్కెట్లు వేస్తున్నాడు. ఏది లాభసాటిగా ఉంటే దాన్నే అనుసరిస్తాడు. అధికారాన్ని చేపట్టిన నెల రోజుల తరువాత బుధవారం నాడు మొదటిసారిగా ట్రంప్ మంత్రివర్గ తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఖనిజాల మీద ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఉక్రెయిన్ భద్రత గురించి సాధారణం కంటే ఎక్కువగా ఎలాంటి హామీలు ఇవ్వటం లేదని ట్రంప్ చెప్పాడు. అంతే కాదు, శాంతి ఒప్పందం కుదరాలంటే పుతిన్ కొన్ని రాయితీలకు అంగీకరించాల్సి ఉంటుందని కూడా చెప్పాడు. ఒక వైపు స్థంభింపచేసిన నిధులపై ఆంక్షలను ఎత్తివేస్తూ ఆయుధాలు కొనుగోలు చేసేందుకు తైవాన్‌కు అవకాశం కల్పించిన ట్రంప్ దాని రక్షణ గురించి అడగ్గా తాను వ్యాఖ్యానానికి నిరాకరించటమే కాదు. చైనా పెట్టుబడులను అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పాడు. ఇది అమెరికా వైఖరికి భిన్నంగా ఉంది.

అందించిన మిలిటరీ, ఆర్థిక సాయాన్ని తీర్చే స్థితిలో ఉక్రెయిన్ లేనందున అక్కడ ఉన్న 500 బిలియన్ డాలర్ల విలువగల విలువైన ఖనిజాలు, సహజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తీరా ఇప్పుడు వాటిని వెలికి తీసేందుకు రెండు దేశాలు కలసి ఒక సంస్థను ఏర్పాటు చేసి తద్వారా వచ్చే రాబడిలో సగాన్ని దాని ద్వారా ఉక్రెయిన్ రక్షణ, పునర్ నిర్మాణానికి ఖర్చు చేయాలని అంగీకరించినట్లు చెబుతున్నారు. అమెరికా ఇచ్చిన సాయానికి అది ఖనిజాలను స్వాధీనం చేసుకుంటే తామిచ్చినదాని సంగతేమిటనే ప్రశ్న నాటోలోని ఐరోపా ధనిక దేశాల నుంచి రావటం అనివార్యం. అందువలన ఉమ్మడి సంస్థ పేరుతో అమెరికా పెత్తనంలోకి వెళ్లేట్లుగా చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఒకటి స్పష్టమైంది. గత మూడు సంవత్సరాలుగా ఉక్రెయిన్ ప్రతిఘటనలో రష్యాకు తగిలిన ఎదురుదెబ్బలు, ఓటమి అంటూ పశ్చిమ దేశాలు, వాటి కనుసన్నలలో నడిచే మీడియా వండివార్చిన కట్టుకథలు, కృత్రిమ వీడియోలు వాస్తవం కాదని, ఉక్రెయిన్ ఓడిపోవటం తప్ప మరొకటి జరగదని తేలిపోయింది.


అంతేగాక, ప్రతిదాన్ని డాలర్ల లాభాలతో కొలిచే ట్రంప్‌కు ఉక్రెయిన్ మీద పెట్టే ప్రతి డాలరునూ రాబట్టుకోవటం కష్టమని, అందువల్లనే ఖనిజాల ఒప్పందం అని కూడా చెబుతున్నారు. విజయం సాధించినట్లు పుతిన్ చెప్పుకోవచ్చు గానీ అది ఉక్రెయిన్‌లో గెలిచో మరొకదానితోనో కాదని ట్రంప్ యంత్రాంగ చర్యలతో అనే కొత్త పల్లవిని పశ్చిమ దేశాల విశ్లేషకులు ఎత్తుకున్నారు. శుక్రవారం నాడు జెలెన్‌స్కీ వాషింగ్టన్ వెళతాడని, ఒప్పందం మీద సంతకాలు చేస్తాడని వచ్చిన వార్తలు కార్యరూపం దాలిస్తే ఒప్పంద అంశాలు వెల్లడైన తరువాత మాత్రమే ఒక స్పష్టత వస్తుంది.

ఒకవైపు చైనా మీద ఇక యుద్ధమే శరణ్యం అన్నట్లుగా సుంకాలు విధించేందుకు పూనుకున్నట్లు చెబుతున్న ట్రంప్ బుధవారం నాడు చైనాలో అంతర్భాగం-తిరుగుబాటు రాష్ట్రంగా ఉన్న తైవాన్ రక్షణ గురించి వ్యాఖ్యానించేందుకు నిరాకరించాడు. చైనా నేతతో తనకు మంచి సంబంధం ఉందని, చైనా పెట్టుబడులను కోరుతున్నట్లు చెప్పాడు. నిజానికి ఇది చైనాకు బిస్కెట్ వేయటం తప్ప మరొకటి కాదు. తైవాన్‌కు 87 కోట్ల డాలర్ల మిలిటరీ సాయంతో సహా 530 కోట్ల డాలర్లను ఇచ్చేందుకు గతంలో నిర్ణయించిన అమెరికా ఆ నిర్ణయాన్ని స్థంభింపచేసింది. తాజాగా నిధుల విడుదలకు నిర్ణయించింది. అలాంటపుడు బలవంతంగా తైవాన్ స్వాధీనానికి చైనాను అనుమతిస్తారా అన్న ప్రశ్నకు మాట్లాడేందుకు నిరాకరించినంత మాత్రాన వైఖరిని మార్చుకున్నట్లు కాదు. ఉక్రెయిన్ మీద ట్రంప్ మాటలను చూస్తుంటే తైవాన్‌ను కూడా వదిలించుకుంటారా అన్నది జనాభిప్రాయంగా ఉందని, ఇలా అయితే అమెరికా వాగ్దానాలను ఎవరూ నమ్మరని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వాపోయింది. ఖనిజాల ఒప్పందంతో ట్రంప్‌ను సంతుష్టీకరించేందుకు ఉక్రెయిన్ ఎలా చూస్తున్నదో తైవాన్ కూడా అమెరికా నుంచి ఏడు నుంచి పది బిలియన్ డాలర్ల విలువగల ఆయుధాలను కొనుగోలు చేస్తామని లీకులు వదిలింది. కొద్ది రోజులుగా ట్రంప్ చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలకు తేడా ఉంది. అందుకే అవి ఏ విధంగా మారతాయి, ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయన్నది ఊహించటం కష్టం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

విజ్ఞాన కాంతిపుంజం సి.వి.రామన్

సందర్భం



డా॥ దేవరాజు మహారాజు



ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్ డే

ప్రాయోగిక విజ్ఞానం కేవలం తమకే సాధ్యమని యూరోప్ దేశాలు విర్రవీగుతున్న దశలో బ్రిటీష్ ఇండియాలోని ఒక భారతీయుడు, ఏ అవకాశాలు లేని ఒక మారుమూల గ్రామంలో పుట్టినవాడు, నెలకు పది రూపాయల జీతంతో జీవితం వెళ్ళబోస్తున్న ఒక కాలేజి ట్యూటర్ కుమారుడు స్వయంశక్తితో కాకలుతీరిన శాస్త్రజ్ఞుడిగా తయారై, నోబెల్ బహుమతి సాధించి, దేశంలో అనేక పరిశోధనా సంస్థలు స్థాపించి, సర్వస్వం దేశానికి అర్పించగలగడం కేవలం చంద్రశేఖర్ వెంకట రామన్ వంటి అద్భుత వ్యక్తులకు మాత్రమే సాధ్యపడుతుంది. తమిళనాడులో తిరుచునాపల్లి సమీపంలో 1888 నవంబర్ 7న పుట్టిన సి.వి.రామన్ కుటుంబం అతని బాల్యంలో విశాఖపట్నానికి చేరింది. రామన్ చదువుకునే పాఠశాల సముద్ర తీరాన ఉండేది. తరగతి గదిలోంచి చూస్తే, లేచి పడే సముద్ర కెరటాలు కనిపిస్తూ ఉండేవి. బాల్యంలో రామన్ సముద్రాన్ని తదేకంగా చూస్తూ ఉండేవాడు. అలా సి.వి.రామన్ బాల్య దశలో విశాఖ సముద్రం ఎంతగానో ప్రభావితం చేసింది.

సి.వి. రామన్ తన పదకొండవ యేట మెట్రిక్యులేషన్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. అప్పుడక్కడ పనిచేసే యూరోపియన్ ప్రొఫెసర్లంతా ఈ కుర్రవాడు పొరపాటున తమ క్లాసుకు వచ్చాడేమోనని భావించేవారు. ఆ తర్వాత ఆయన తన పద్దెనిమిదోయేట లండన్ నుండి వెలువడే 'ద ఫిలసాఫికల్ మేగజైన్' (1906)లో పరిశోధనా పత్రాలు ప్రచురించాడు. అప్పటికి ఆయన పి.జి (యం.ఎ) విద్యార్థి. తనకు ఇష్టమైన భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ, వెలుగు కిరణాల్ని కొలుస్తూ ఉండేవాడు. ప్రొఫెసర్ ఆర్.ఎన్. జోన్స్ రామన్ ప్రశ్నలకు సమాధానాలివ్వలేక -నేచర్, ఫిలసాఫికల్ మేగజైన్ వంటి పత్రికలకు రామన్‌తో వ్యాసాలు రాయించి పంపిస్తూ ఉండేవాడు. ఒక రకంగా తొలి దశలో రామన్‌కు ఆయన గైడ్'గా ఉపయోగపడ్డాడు.

రామన్‌ది మామూలు కుటుంబం. ఉద్యోగం చేయడం తప్పనిసరైన పరిస్థితి. బ్రిటీష్ గవర్నమెంట్ వారి ఫెనాన్స్ సర్వీసులో చేరాడు. పెద్ద జీతం, బంగళా వంటివి అమిరాయి. అప్పుడే లోకసుందరి అమ్మాళ్‌తో వివాహమైంది. 1907లో రామన్ ఉద్యోగం కలకత్తాకు మారింది. అక్కడికి చేరుకున్న మొదటి వారంలోనే ఆయన ట్రామ్‌లో ప్రయాణిస్తూ బౌ బజార్ స్ట్రీట్‌లో ఒక బోర్డు (ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్) చూశాడు. ఆ సాయంత్రమే అక్కడికి వెళ్ళి వివరాలు తెలుసుకున్నాడు - డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ 1876లో ఆ అసోసియేషన్ స్థాపించి, భారతీయ శాస్త్రవేత్తలు జాతీయాభిమానంతో దేశంలోనే పరిశోధనలు సాగించాలన్న మహదాశయాన్ని ప్రచారం చేస్తున్నాడు. ఆ విషయం తెలుసుకుని సి.వి. రామన్ వెంటనే అందులో చేరిపోయాడు. అంతేకాదు, నోబెల్ బహుమతికి అర్హత సంపాదించగలిగే స్థాయి పరిశోధనలు కొన్నేళ్లలోనే అక్కడ చేయగలిగాడు. ఒకవైపు ఆర్థిక శాఖలో ఉద్యోగం చేస్తూ, మరోవైపు భౌతికశాస్త్రంలో పరిశోధనలు చేయడం ఎంత కష్టం? క్రమశిక్షణ, పట్టుదల, దీక్ష, అన్నీ రామన్‌కు ఉన్నాయి గనకనే - ఇతరులకు అసాధ్యమనిపించినవి సాధ్యమేనని ఆయన రుజువు చేసి చూపాడు.

ఒక దశలో టైగర్ ఆఫ్ బెంగాల్ అశుతోష్ ముఖర్జీ కలకత్తా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు, బ్రిటీష్ ప్రభుత్వంతో మధ్యవర్తిత్వం నెరపి, పరిశోధనల నిమిత్తం సి.వి.రామన్‌కు రెండేళ్ల సెలవు ఇవ్వాల్సిందిగా కోరాడు. ఈ భారతీయుడి పరిశోధనలపై బ్రిటీష్ ప్రభుత్వానికి నమ్మకం కలగలేదు. ఆ అభ్యర్థనను తోసిపుచ్చి, వీలు కాదని చెప్పింది. చివరకు అశుతోష్ ముఖర్జీ నిబంధనల్ని కొద్దిగా సడలించి సి.వి.రామన్‌ను ఎలిట్ ఛైర్ ఆఫ్ ఫిజిక్స్‌కు ఎన్నుకున్నాడు. అది 1917వ సంవత్సరం. చూస్తూ చూస్తూ పెద్ద ఉద్యోగం, హోదా, డాబు, వసతులు అన్నీ వదులుకుని, ఒక చిన్న ఉద్యోగానికి రావడం అందరూ చేయగల పని కాదు. ఆయనలోని వైజ్ఞానిక జిజ్ఞాస, నిబద్ధత, ధ్యేయం అన్నీ కలిసి ఆయనను ఆ పనికి ఉసిగొల్పాయి. ఒకవైపు విశ్వవిద్యాలయంలో బోధన, మరోవైపు పరిశోధనల మధ్య ఆయన జీవితం ఆ కాలంలో ఊపిరి సలపకుండా సాగింది. తన జీవిత సహచరి సహాయ సహకారాలతో, రామన్-వైజ్ఞానిక శిఖరాలను అధిరోహించి, ఈ దేశపు జెండాను దిగ్విజయంగా ఎగరేశాడు. జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే, ఎన్నింటినో వదులుకోక తప్పదు-అన్న విషయం రామన్ జీవితం స్పష్టం చేసింది. 'రామన్ ఎఫెక్ట్' వెలుగులోకి వచ్చిన పదేళ్ళలో ప్రపంచంలో సుమారు రెండు వేల పైచిలుకు పరిశోధనా పత్రాలు అదేవిషయాన్ని ధృవపరిచాయి. ఆప్టిక్స్‌కు సి.వి.రామనే ఆద్యుడు. 'సైకాలజీ ఆఫ్ విజన్'ను మొదట అధ్యయనం చేసిందీ ఆయనే. ఇలా వైజ్ఞానిక రంగంలో ఎన్నో శాఖలకు ఆయన బీజం వేశాడు. అందుకే భారత ప్రభుత్వం 'భారత రత్న'తో గౌరవించుకున్న తొలి శాస్త్రవేత్త కూడా ఆయనే అయ్యారు!

'రామన్ ఎఫెక్ట్' పేరుతో 1928 ఫిబ్రవరి 28న సి.వి.రామన్ తన పరిశోధనల్ని ప్రతిపాదించారు. ఆ రోజును గుర్తు చేసుకుంటూ-దేశ ప్రజలలో వైజ్ఞానిక స్ఫూర్తిని నింపడానికి అదే ఫిబ్రవరి 28ని మనం జాతీయ వైజ్ఞానిక దినంగా జరుపుకుంటున్నాం. అయితే సర్ సి.వి.రామన్‌కు నోబెల్ పురస్కార ప్రదానం 1930లో జరిగింది. ఇది మన భారత దేశానికే కాదు, మొత్తం ఆసియా ఖండానికే తొలి నోబెల్ బహుమతి అయ్యింది.

/వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్/

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో

వెనుకబడ్డ భారత్

- 9 అంశాలలో పనితీరు నిరాశాజనకం
- దేశంలో ఉత్తరాఖండ్ టాప్...బీహార్ లాస్ట్

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీఎస్‌లు) సాధనలో భారత్ పనితీరు ఏమంత ఆశాజనకంగా లేదు. లక్ష్యాల సాధనలో పురోగతి నెమ్మదిస్తోంది. మొత్తం 167 దేశాల పనితీరును విశ్లేషించగా భారత్ 109వ స్థానంలో నిలిచింది. ఇది భారత్‌కే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ఆందోళన కలిగించే విషయమని బుధవారం విడుదలైన నివేదిక తెలిపింది. గత సంవత్సరంతో పోలిస్తే మన దేశం తన ర్యాంకును మూడు స్థానాలు మెరుగుపరచుకోవడం కొంత ఊరట కలిగించే అంశం. సుస్థిర అభివృద్ధి నివేదిక, 2024కు సంబంధించిన నీతి ఆయోగ్ నివేదిక ఆధారంగా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) ఈ నివేదికను ప్రచురించింది.

ప్రణాళికా సంఘం మాజీ డిప్యూటీ ఛైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా, నీతి ఆయోగ్ మజీ సీఈఓ షెర్పా అమితాబ్ కాంత్, సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ సంయుక్తంగా నివేదికను ప్రచురించారు. 'ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా, 140 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్న దేశంగా చూస్తే ఎస్‌డీసీలో భారత్ పనితీరు అంత బాగా లేదు. ఇది ఈ ప్రపంచానికి కూడా మంచి పరిణామం కాదు. అయితే 2019-2022 మధ్య భారత్ పనితీరు అంతర్జాతీయ ధోరణుల కంటే వెనుకబడి ఉంది. 2023లో మెరుగుదల కన్పించినప్పటికీ 2024 ర్యాంకింగ్ ఆందోళనకంగానే ఉంది' అని ఆ నివేదిక ఎత్తిచూపింది. 2030 నాటికి 16 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఐరాస సభ్య దేశాలన్నీ అంగీకరించాయి. ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచేందుకు ఈ లక్ష్యాలను ఉద్దేశించారు.

అయితే అభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ వెనుకబడి పోయింది. సమ్మిళిత ప్రపంచ స్కోరు 67 శాతం ఉండగా మన దేశం 63.9 శాతం స్కోరు మాత్రమే సాధించింది. మొత్తం 16 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఐరాస నిర్దేశించగా వాటిలో తొమ్మిదింటిలో భారత్ స్కోరు ప్రపంచ సగటు కంటే తక్కువగా ఉంది. జీరో ఆకలి, మంచి ఆరోగ్యం-బాగోగులు, లింగ సమానత్వం, స్వచ్ఛమైన నీరు-పారిశుధ్యం, పరిశ్రమ-ఆవిష్కరణ-మౌలిక సదుపాయాలు, అసమానతల తగ్గింపు, సుస్థిర నగరాలు-సమూహాలు, భూమిపై జీవనం, శాంతి-న్యాయం-బలమైన సంస్థలు...ఈ అంశాలలో మన దేశం పనితీరు నిరాశ కలిగిస్తోంది.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఛార్టులో దేశంలో ఉత్తరాఖండ్ (79.2 శాతం స్కోరు) మొదటి స్థానంలో నిలిచింది. తమిళనాడు (77.4), కేరళ (77), పశ్చిమ బెంగాల్ (72.1) తర్వాతి స్థానాలలో ఉన్నాయి. బెంగాల్ 13వ ర్యాంక్, గుజరాత్ 16వ ర్యాంక్, మహారాష్ట్ర 17వ ర్యాంక్, ఉత్తరప్రదేశ్ 21వ ర్యాంక్ సాధించగా 56.9 శాతం స్కోరుతో బీహార్ చివరి స్థానంలో నిలిచింది.



కొమరవోలు గ్రామస్తులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాలకృష్ణ

ఫొటో దిగారుగా... ఇక పోండి

- కొమరవోలు గ్రామస్తులపై బాలకృష్ణ చిందులు

ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా పామర్రు మండలం నిమ్మకూరులో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురువారం పర్యటించారు. ఎన్‌టిఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ తల్లి బసవతారకం సొంతూరైన కొమరవోలు నుంచి పలువురు గ్రామస్తులు నిమ్మకూరు వచ్చి ఆయనను కలిశారు. బాలకృష్ణతో కలిసి ఫొటోలు కూడా దిగారు. అనంతరం "మా గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయండి" అని కొమరవోలు గ్రామస్తులు బాలకష్ణను కోరారు. అందుకు ఆయన... 'నేను పట్టించుకోను.. ఫొటోలు దిగారుగా... చాలు ఇక పోండి" అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "కొమరవోలు గ్రామమా? అదెక్కడ ఉంది?" అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. 'లింగాయత్తులను పట్టించుకోవాల్సిన అవసరం లేదు' అని వ్యాఖ్యానించారు. దీంతో ఆ గ్రామస్తులు నిరాశతో అక్కడి నుండి వెళ్లిపోయారు. ప్రస్తుతం బాలకృష్ణ చేసిన ఈ వ్యాఖ్యల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో నీటి తొట్టిలో పడి ఏడాది చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన చిన్న రాయుడు, నీరజ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులు ఇంటిదగ్గర పనులు చేసుకుంటూ ఉండగా చిన్న కుమారుడు సూర్య (1) ఆడుకుంటూ నీటి తొట్టిలో పడి ఊపిరి ఆడక మృతి చెందాడు. సూర్యను వెతుక్కుంటూ వచ్చిన తల్లిదండ్రులు విగత జీవిగా మారిన చిన్నారిని చూసి హతాశు లయ్యారు. తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి.

ఎస్‌వియు దూరవిద్యకు అనుమతులు మంజూరు

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో నడిచే కోర్సులకు 2024 - 25 సంవత్సరానికి గాను "యుజిసి - డెబ్" అనుమతులు మంజూరు చేసింది. యుజిసి - డెబ్ గత 2022 సంవత్సరం నుంచి ఎస్వీయూ దూర విద్య కోర్సులకు అనుమతులు మంజూరు చేయలేదు. గత జనవరిలో డెబ్ నుంచి వచ్చిన ఎక్స్పర్ట్ కమిటీ యూనివర్సిటీ నందు మూడు రోజులపాటు సుదీర్ఘంగా పరిశీలించి యుజిసికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికను యుజిసి పరిశీలించి గురువారం ఎస్‌వియు దూరవిద్య కోర్సులకు 2024 - 25 సంవత్సరం నుంచి అనుమతులను మంజూరు చేసింది. దీని ప్రకారం 17 పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చింది. ఈ సంవత్సరం నుంచే దూరవిద్య కోర్సులకు ప్రకటన ఇవ్వనున్నామని వారు తెలిపారు.

సబ్బుపై సర్ సివి.రామన్ కళారూపం

ప్రజాశక్తి - గొల్లప్రోలు (కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు సబ్బుపై సర్ సివి.రామన్ కళారూపాన్ని ఆవిష్కరించారు. 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా ఆయన దీన్ని రూపొందించారు. రామన్ జీవిత చరిత్రపై అవగాహన కల్పించేందుకు దీన్ని రూపొందించాని ఆయన తెలిపారు.

రికార్డు స్థాయిలో జల విద్యుదుత్పత్తి

- గడువుకు నెలరోజుల ముందుగానే లక్ష్యానికి మించి సాధన
- ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని స్థానిక జల విద్యుత్ కేంద్రంలో సెంట్రల్ విద్యుత్ సెంట్రల్ అథారిటీ నిర్దేశించిన లక్ష్యానికి మించి విద్యుత్ ఉత్పత్తిని సాధించి రికార్డు నెలకొల్పమని ఎపి జెన్‌కో ఇఇ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2024 -25 మార్చి 31 నాటికి విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉండగా, ఒక నెల రోజులు ముందే టార్గెట్‌ను అధిగమించి విద్యుత్ ఉత్పత్తి సాధించామన్నారు. 2024-25 మార్చి చివరినాటికి 477 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయవలసి ఉండగా ఈనెల 26, బుధవారం రాత్రి 11. 50 గంటలకు 477.644 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగ మించి రికార్డు నెలకొల్పామన్నారు. ఈ ఘనత సాధించడంలో ఎపి జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఇచిన్న కామేశ్వరరావు, ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి సహాయ సహకారాలతో అరుదైన రికార్డు సాధించామన్నారు. అదేవిధంగా ఇంజనీర్లు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు శ్రమ కృషి ఫలితంగానే ఈ రికార్డు సాధ్యమైందన్నారు ముందు జల విద్యుత్ కేంద్రంలో ఇంజనీర్లు కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు సమిష్టి కృషితో విద్యుదుత్పత్తిలో మరిన్ని రికార్డులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెక్కలి సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

ప్రజాశక్తి- టెక్కలి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారి ఉమామహేశ్వరరావు గురువారం సస్పెండ్ అయ్యారు. జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి నాగలక్ష్మి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ చట్టంలో ఉన్న వెసులుబాటని తనకు అనుకూలంగా మార్చుకొని శ్రీకాకుళానికి చెందిన ఒక స్థలం టెక్కలిలో రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై శాఖాపరమైన దర్యాప్తు నిర్వహించారు. ఈ దర్యాప్తులో సబ్ రిజిస్టర్ ఉమామహేశ్వరరావు అక్రమాలకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణ మేరకు సస్పెండ్ అయ్యారు. ఈయన గతేడాది సెప్టెంబరు 26న టెక్కలి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు: బలిమెల జలాశయం నుంచి ఏడువేల క్యూసెక్కులు నీటిని తీసుకుంటున్నామని సీలేరు కాంప్లెక్స్ ఎపి జెన్‌కో సూపరెంటిండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రబి పంటకు సీలేరు నది నుంచి నీటిని విడుదల చేయాలని ఎపి జెన్‌కో అధికారులను ఇరిగేషన్ అధికారులు కోరడంతో, దిగువ సీలేరు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా మూడు వేలు క్యూసెక్కులు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలు విద్యుదుత్పత్తి అనంతరం 4300 క్యూసెక్కులు కలుపుకొని మొత్తం 7300 క్యూసెక్కులు నీటిని గోదావరి డెల్టా విడుదల చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 10 నుంచి డొంకరాయి విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా జలాశయం గేట్లు ద్వారా 4.17 టీఎంసీలు నీటిని విడుదల చేసామన్నారు. మార్చి 21 వరకు గోదావరి డెల్టాకు నీటి విడుదల కొనసాగించవలసిన నేపథ్యంలో డొంకరాయి జలాశయంలో నీటిమట్టలు తగ్గకుండా ఉండేందుకుగాను బలిమెల జలాశయం నుంచి ఇప్పటి వరకు తీసుకుంటున్న ఆరువేల క్యూసెక్కుల నీటితో కలిపి అదనంగా మరొక వెయ్యి క్యూసెక్కులు కలుపుకొని ఏడు వేలు క్యూసెక్కులు నీటిని తీసుకుంటున్నామని ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

'కూలీ'లో పూజ కన్ఫర్మ్



రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబోలో తెరకెక్కుతోన్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే భాగమైనట్లు చిత్రబృందం ప్రకటించింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో పూజ స్పెషల్ సాంగ్ చేస్తుందని తెలుస్తోంది.

ఆ పాట పాడినందుకు సిగ్గుగా ఉంది

ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ తను పాడిన స్పెషల్ సాంగ్‌పై షాకింగ్ కామెంట్స్ చేశారు. తాను పాడిన ఆ పాట పిల్లలను చెడగొట్టిందని అన్నారు. ఆ పాట పాడినందుకు సిగ్గుపడుతున్నా అని తెలిపారు. అగ్నిపథ్ మూవీలోని 'చికినీ చమేలీ అనే పాట'ని గతంలో ఆమె పాడారు. 'ఐటెమ్ సాంగ్స్‌లో అసభ్య పదజాలం వాడుతుంటారు. చిన్న పిల్లలు వాటి అర్థమేంటో తెలియకుండా పాడేస్తున్నారు. కొంతమంది పిల్లలు నా దగ్గరికి వచ్చి 'మీ పాట చాలా బాగుంది మీకోసం పాడతా' అని ఆ పాట పాడుతున్నారు. అప్పుడు నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. ఓ ఐదారేళ్ల పిల్ల అలాంటి లిరిక్స్ పాడటం సరికాదు' అని శ్రేయా ఘోషల్ చెప్పారు. ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇప్పటివరకు 25 వేలకు పైగా పాటలు పాడిన శ్రేయా, తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, బెంగాలీ అన్ని భాషల్లోనూ అభిమానులను సొంతం చేసుకున్నారు. ఇండస్ట్రీలో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న సింగర్స్‌లో ఆమె కూడా ఒకరు.

డబ్బింగ్ పనుల్లో 'వందేమాతరం'



రత్నమ్స్ ఫిలిం క్రియేషన్స్ ప్రొడక్షన్ నం.2 బ్యానర్‌లో దేశభక్తి ప్రధాన అంశంగా, పల్లెలూరు నేపథ్యాన్ని ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన చిత్రం 'వందేమాతరం'. ప్రస్తుతం డబ్బింగ్ పనులు కొనసాగు తున్నాయి. ప్రధాన పాత్రలో అందాల నటుడు, నటభూషణ్ శోభన్‌బాబు గారి మేనల్లుడు శోభన్ రాజా నటించారు. నేవీ సూర్యభాయ్ వాచస్పతి జయరాజు, సర్వేశ్వరరావు, శాంతభూషణం, సూరిబాబు, వెంకట్, ఇస్సాకు, అరుణ్, మాస్టర్ సుజన్ నటించారు. కథా, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం బి.వి.రత్నం. నిర్మాత జంగం కిరణ్‌బాబు,కో డైరెక్టర్ కొండ్రు శేషు, కెమెరామెన్ బి.నాగేంద్రబాబు, సంగీతం రాజ్‌కిరణ్. ఇందులో నటించిన నటీనటులు తమ పాత్రలకు సంబంధించిన డబ్బింగ్‌ను చెబుతున్నారు. శోభన్‌రాజా ప్రధాన పాత్రలో అలరించనున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా ప్రజలకు ఎంత వరకూ ఆ ఫలాలు అందుతున్నాయనే విషయమై ఈ సినిమాలో పొందుపర్చారు. అధ్యాపకుడుగా ఉన్న రాజా ఆ తర్వాత సమాజ ఉద్ధరణకు ఏమిచేశాడనే కథాంశంతో సినిమా ఆద్యంతం సాగనుంది.

నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటిఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న రక్షిత మంచినీటి పథకాలను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న ప్రధాన రక్షిత మంచినీటి పథకం పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఇతర రక్షిత మంచినీటి పథకాల పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బోరుబావుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

గుండెపోటుతో ఉపాధి కార్మికురాలు మృతి

ప్రజాశక్తి - పెనుగొండ (పశ్చిమగోదావరి జిల్లా)


గుండెపోటుతో ఉపాధి కార్మికురాలు మృతి చెందిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దొంగరావిపాలేనికి చెందిన పిల్లి లక్ష్మి (55) దేవ గ్రామంలోని పంచాయతీ చెరువులో ఉపాధి పనులకు ఆ గ్రామంలోని సహచర కార్మికులతో కలిసి వెళ్లారు. పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేందుకు ఆటో కోసం వేచిచూస్తుండగా లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తోటి కార్మికులు ఆమెను వెంటనే పెనుగొండలోని పిహెచ్‌సికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు.

గూగుల్ క్లౌడ్‌లో ఉద్యోగులపై వేటు

వాషింగ్టన్ : గూగుల్ తాజాగా తన క్లౌడ్ డివిజన్‌లో పలువురు ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఎంతమంది ఉద్యోగులను తొలగించారనేది వెల్లడి కాలేదు. 'సంస్థ దీర్ఘకాలిక విజయాల కోసం కంపెనీ కీలకమైన కొన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోంది. ఈ సమయంలో కొన్ని సర్దుబాట్లు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కారణంగానే.. కొంతమంది ఉద్యోగులను తొలగించాల్సి వచ్చింది. కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో అవకాశాల్ని అందిపుచ్చుకొనేందుకు అనేక సర్దుబాట్లు చేశాం' అని గూగుల్ ప్రతినిధి వెల్లడించారు. ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో గూగుల్ తన క్లౌడ్ వ్యాపారంలో ఆదాయ అంచనాలను అందుకోలేకపోయింది.

కొనసాగుతున్న సహాయక చర్యలు

- **టిబిఎంను తొలగిస్తేనే వాస్తవ పరిస్థితి తెలిసే అవకాశం**



సహాయక చర్యలు చేపడుతున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బిసి) టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. 14 సర్వీస్ ఏజెన్సీలతో దాదాపు 400 మంది అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు, ఇతర సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ముగ్గురు మంత్రులు, రెండు జిల్లాల కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాలతో పాటు వందలాది మంది సహాయక సిబ్బంది కార్మికులను కాపాడేందుకు 24 గంటల పాటు టన్నెల్ లోపలకు, బయటకు తిరుగుతున్నారు. టన్నెల్ బోరింగ్ మెషిన్(టిబిఎం)పై పడిన శిథిలాలను తొలగిస్తే తప్ప అసలు నిజం బయటకు రాదు. అమెరికాకు చెందిన రాబిన్‌సన్ మైనింగ్ కంపెనీ ప్రత్యేక యంత్రాలు, స్పెషల్ కెమెరాలతో అవతల ఉన్న పరిస్థితిని పసిగట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. అంతర్జాతీయ నిపుణులతోపాటు అత్యాధునిక యంత్ర పరికరాలైన ప్లాస్మా కట్టర్లు, హైగ్రేడ్ కట్టర్లు, శిథిలాలను తొలగించే యంత్రాలను వాడుతున్నారు. టన్నెల్ బోరింగ్ మెషిన్(టిబిఎం) తొలగించడానికి తెలంగాణ జెపి నవయుగ కంపెనీలు నిరాకరించినట్లు తెలిసింది. దీని విలువ రూ. 100 కోట్ల వరకు ఉంటుందని, మళ్లీ పనులు చేయాలంటే కొత్త యంత్రాన్ని తెప్పించడానికి సమయం పడుతుందనే ఉద్దేశంతో అలా అన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో టిబిఎం కట్‌చేయడానికి అంగీకరించినట్లు తెలిసింది. కన్వేయర్ బెల్టును సైతం మరమ్మత్తు చేశారు. టిబిఎం ముక్కలు కటేచేయడానికి ప్లాస్మా ఉపయోగించాలని ప్రభుత్వం గ్యాస్ కట్టర్లను నిర్ణయించింది. రెండు, మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తిచేస్తామని, మరో మూడు నెలల్లో సొరంగం పనులు మళ్లీ పునరుద్ధరిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ ప్రకటించడం గమనార్హం.

చిత్రావతి నది ఆక్రమణ..!

- **రియల్టర్‌కు గత ప్రభుత్వం.. అధికారుల అండ..!?**



ప్రజాశక్తి-చిలమత్తూరు

సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండ, కోడూరు, నారేముద్దేపల్లి, మర్రిమాకులపల్లి రెవెన్యూ పొలాల్లో బెంగుళూరుకు చెందిన ఓ రియల్టర్, అతని కుటుంబ సభ్యుల పేరుతో రీసర్చ్ కేంద్రాల మాటున సుమారు 436 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. దీంతో పాటు ప్రభుత్వ అసైన్డ్ భూములు, వంకపోరంబోకు భూములు అనాధికారికంగా సుమారు 600 ఎకరాలు ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు ఇరిగేషన్ వంకలు, చిత్రావతి నదీ పరిహార ప్రాంతమూ ఉంది. వీటన్నింటికీ కంచెవేసి ఆ రియల్టర్ ఆక్రమణలో ఉంచుకున్నాడు. ఏకంగా చిత్రావతి నదిని ఆక్రమించి కంచె వేయడం గమనార్హం. దీనిపై గతంలో ప్రజాసంఘాలు, రైతులు వివిధ రూపాల్లో పోరాటాలు చేసినా అప్పటి ప్రభుత్వంలో స్థానిక నాయకుల అండదండలు ఉండ టంతో ఆక్రమణలపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

రియల్టర్ స్వాధీనంలో ఉన్న భూములు

కోడూరు రెవెన్యూ పోలం సర్వే నెంబర్ 658-4 విస్తీర్ణం 1.33, 678-1 విస్తీర్ణం 2.21, సర్వెనెంబర్ 679-1 విస్తీర్ణం 7.98 సెంట్లు, 679-2 విస్తీర్ణం 4.02 సెంట్లు, 679-3 విస్తీర్ణం 5.30 సెంట్లు, కొడికొండ రెవెన్యూ పొలంలో 12-2లో 6.41 సెంట్లుతో పాటు అసైన్డ్ భూమిని వారి స్వాధీనం చేసుకుని కంచె వేసుకుని ఆక్రమణలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులే స్వయంగా నిర్ధారించారు.

చిత్రావతి నది, ఇరిగేషన్ కాలువల ఆక్రమణ

చిత్రావతి నదితో పాటు ఇరిగేషన్ కాలువలను సైతం రియల్టర్ ఆక్రమించారు. ఏకంగా చిత్రావతి నదిపై బ్రిడ్జిని నిర్మించడంతో పాటు, ఇరిగేషన్ కాలువల నీరు కుంటల్లో చేరేలా ప్లాన్ చేసి పెద్దపెద్ద కుంటలను నిర్మించుకున్నాడు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆస్తులుగా ఉన్న కాలువలు, చిన్న డ్యాంలను సైతం ఆక్రమించు కున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ఆక్రమణలపై పత్రికల్లో వార్త కథనాలు వచ్చినప్పుడు రిపోర్ట్‌ల పేరుతో నానా హంగామా చేసే అధికారులు ఆ తర్వాత మిన్నకుండిపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

వంక పోరంబోకు,అసైన్డ్ భూములకు కంచె..!

రియల్టర్ వేసుకున్న కంచె లోపలే వంక పోరంబోకు భూములు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు సుమారు వంద ఎకరాలకు పైబడి ఉన్నాయి. ఈ విషయాన్ని గతంలో స్వయంగా రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. ఆక్రమణలో ఉన్న వంక పోరంబోకు భూములను బయటకు తెచ్చేందుకు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీనికి తోడు పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను సైతం ఆక్రమించుకుని చుట్టూ కంచె వేసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. పొలాలకు దారి మూసుకుపోవడంతో కిందనున్న రైతులు ఆ రియల్టర్ చెప్పిన ధరకు భూములను అమ్ముకోవాల్సి వచ్చింది. మరికొంత మంది రైతులు గత 15 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా రెవెన్యూ అధికారుల నుంచి స్పందన కరువైంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - రొద్దం

కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా దొమ్మితిమర్రి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు. మరొక యువకుడు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబందించిన వివరాలు... మండలంలోని రెడ్డిపల్లికి చెందిన చరణ్, తిరుమలేష్, భరత్ అనే ముగ్గురు యువకులు శివరాత్రి జాగరణ కోసం లేపాక్షికి ద్విచక్రవాహనంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బయలుదేరి వెళ్లారు.కర్నాటక రాష్ట్రం పావగడ తాలూకా దొమ్మితి మర్రి సమీపాన వీరు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చరణ్ (19) అక్కడికక్కడే మృతిచెందాడు, తీవ్ర గాయాలపాలైన తిరుమలేష్(22)ను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన భరత్ హిందూపురంలోని ఓప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు చరణ్, చికిత్స పొందుతున్న భరత్ మడకశిరలో చదువుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. మరో మృతుడు తిరుమలేష్ పెనుకొండలో గల కియా పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేసేవాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటో వివరాలు తెలియకపోవటంతో ఆటో ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ప్రమాద వార్త తెలుసుకున్న మంత్రి సవిత మృతుల కుటుంబాలకు తన సానుభూతి తెలియజేశారు. అంతేకాకుండా చికిత్స పొందుతున్న భరత్‌కు మెరుగైన చికిత్స అందించాలని హిందూపురం ఆసుపత్రి సిబ్బందికి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని పట్టుకోవాలని పోలీసులకు ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో 30 గొర్రెలు మృత్యువాత

ప్రజాశక్తి - బత్తలపల్లి



రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై ఐచర్ వాహనం దూసుకెళ్లిన ప్రమాదంలో 30 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు వాపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం రూరల్ మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెలు మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఆ క్రమంలోనే గురువారం మండలంలోని జ్వాలాపురం సమీపంలోకి మేపుల కోసం గొర్రెల మందను తీసుకువచ్చాడు. నీటి కోసం గొర్రెలు రోడ్డు దాటుతుండగా జ్వాలపురం బస్ స్టాప్ దాటిన తర్వాత కదిరి వైపు నుండి వస్తున్న ఐచర్ వాహనం గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ. 3 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ ప్రమాదంతో రోడ్డుపై గొర్రెల మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రమాదంలో గాయపడిన మరో ఐదు గొర్రెలకు పశువైద్యశాల సిబ్బంది చికిత్సలు చేశారు. గొర్రెలను ఢీకొని ఐచర్ వాహనం నిలపడకుండా వెళ్లిపోయింది. అయితే బత్తలపల్లి టోల్గేట్ వద్ద ఆకులేటి వీరనారప్ప తదితరులు ఐచర్ వాహనాన్ని అడ్డగించి పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రమాదంలో 30 గొర్రెలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధిత గొర్రెల కాపరి నారాయణస్వామి కోరుతున్నాడు.

కియా ఇండియాకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' పురస్కారం

ప్రజాశక్తి-పెనుకొండ

కియా ఇండియా కార్ల పరిశ్రమ ప్రతిష్టాత్మక 'గ్రేట్ ప్లేస్ టు వర్క్', గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా ధ్రువీకరణ పత్రం అందుకుందని కియా ఇండియా ఎండి,సీఈఓ గ్వాంగ్గు లీ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ మార్క్ నమ్మకం, సమగ్రత అధిక పనితీరుకు కియా ఇండియా నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ సర్వేలో కియా ఇండియా ఉద్యోగులలో 92శాతం మంది పాల్గొన్నారన్నారు. ప్లాంట్లోని కార్యాలయ సభ్యులు, లైన్ టీమ్ సభ్యులు, భారతదేశంలోని కార్పొరేట్ ప్రదేశాలలో ఉద్యోగులు ఈ సర్వేలో పాల్గొనట్లు తెలిపారు. ఈ సర్టిఫికేషన్ కియా ఇండియా వర్క్ ఫోర్స్ అత్యంత సానుకూల అవగాహణను ప్రతిబింబిస్తోందన్నారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ మోడల్‌ను అనుసరించి అంచనా వేయడంలో ఐదు కీలక కోణాలు ఉన్నాయని అందులో విశ్వసనీయత, గౌరవం, న్యాయం, ఆత్మగౌరవం ,స్నేహశీలి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని వివరించారు. కియా ఇండియా ఈ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. భారతదేశంలో ఈ ప్రతిష్టాత్మక ధ్రువీకరణ పొందిన అతికొద్ది ఆటోమొబైల్ తయారీ దారులలో కియా ఇండియా ఒకటి అని చెప్పారు.

మార్చి కల్లా 4వేల ఉద్యోగులను తీసుకుంటాం : ఎస్‌ఐఎల్‌ఎ

ముంబయి : రియల్ ఎస్టేట్ వేదిక ఎస్‌ఐఎల్‌ఎ దేశవ్యాప్తంగా కొత్తగా 50పైగా క్లయింట్లను పొందినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం 2025 మార్చి ముగింపు నాటికి కొత్తగా 4000 ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ఎస్‌ఐఎల్‌ఎ డైరెక్టర్ రాఘవ్ కపూర్ వెల్లడించారు. ప్రస్తుతం 25వేల పైగా ఉద్యోగులను కలిగి ఉన్నామన్నారు. గత 45 రోజుల్లో అనేక కంపెనీలు తమ సేవల కోసం ఆశ్రయించాయన్నారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల చదరపు అడుగుల ప్రాపర్టీలను నిర్వహిస్తున్నామన్నారు.

'దివాకర్ రోడ్ లైన్స్' పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి

తాడిపత్రి ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డికి చెందిన దివాకర్ రోడ్ లైన్స్ సంస్థకు చెందిన బస్సులకు సర్వీసు ట్యాక్స్ వివాదాల పరిష్కారం నిమిత్తం కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సబ్కా విశ్వాస్ పథకం 2019 వర్తింపజేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్న అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. సబ్ కా విశ్వాస్ పథక ప్రయోజనాలను వర్తింప చేసేందుకు తిరుపతిలో సెంట్రల్ ట్యాక్స్, జిఎస్‌టి కమిషనర్ (డిజిగ్నేటెడ్ కమిటీ) నిరాకరించడంతో దివాకర్ రోడ్ లైన్స్ వ్యాపార భాగస్వామి జెసి ఉమారెడ్డి 2020లో దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. ఈ మేరకు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. ఆ పథకం వర్తింపజేయాలంటే సర్వీసు ట్యాక్స్‌కు చెందిన అన్ని ఆధారాలు సమర్పించాలి. దివాకర్ రోడ్ లైన్స్ సమర్పించిన ఆధారాలు ఐటి శాఖకు ఒకలా, సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్లు ఇచ్చిన వివరాలు మరొకలా వ్యత్యాసాలు ఉన్నాయని బెంచ్ వ్యాఖ్యానించింది. అధికారుల వాదనను ఆమోదించి పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది.

13 నుంచి బంగ్లాదేశ్‌లో గుటెరస్ పర్యటన

న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ మార్చి 13-16 తేదీల్లో ఢాకాలో పర్యటించనున్నారు. బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ ఆహ్వానం మేరకు ఆయన అక్కడకు వెళుతున్నారు. ఈ మేరకు గుటెరస్ కార్యాలయం ఒక ప్రకటకనలో తెలిపింది. బలవంతంగా నిర్వాసితులైన రోహింగ్యాలకు ఆతిథ్యం ఇచ్చే బంగ్లాదేశ్‌కు మద్దతును ఇచ్చేందుకు అంతర్జాతీయ సమాజాన్ని కూడగట్టడాన్ని కొనసాగిస్తామని గుటెరస్ చెప్పారు. బంగ్లాదేశ్‌పై రోహింగ్యాల ప్రభావం గురించి యూనస్ ఆందోళనలను తాము అర్థం చేసుకున్నామని గుటెరస్ చెప్పారు. ఈ మేరకు ఆయన ఈ నెల 25న యూనస్‌కు ఒక లేఖ రాశారు. అలాగే మయన్మార్‌లోని రాఖినెలో మానవతా పరిస్థితులు దిగజారడం పట్ల కూడా ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాల్లో పరిస్థితులను చక్కదిద్దేందుకు ఐక్యరాజ్య సమితి శాయశక్తులా కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్‌కు తమ మద్దతు ఎల్లప్పుడూ వుంటుందన్నారు. యూనస్ నేతృత్వంలో పరివర్తనా క్రమానికి చేయూతనందిస్తామని చెప్పారు.

26/11 ఉగ్రదాడుల కేసు..

- ముంబయి కోర్టు విచారణ రికార్డులను కోరిన ఢిల్లీ హైకోర్టు


న్యూఢిల్లీ : 26/11 ఉగ్రదాడి కేసుకు సంబంధించిన విచారణ రికార్డులు ఇవ్వాలని ముంబయిలోని స్థానిక కోర్టును ఢిల్లీ కోర్టు కోరింది. ఢిల్లీలోని పాటియాల హౌస్ కోర్టు జిల్లా జడ్జి విమల్ కుమార్ యాదవ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసును విచారిస్తున్న ఎన్‌ఐఎ విజ్ఞప్తి మేరకు జడ్జి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి తహవ్వూర్ హుస్సైన్ రానాను భారత్‌కు అప్పగించడానికి ఈ నెల ప్రారంభంలో అమెరికా అంగీకరించిన నేపథ్యంలో ఈ పరిణామం జరగడం విశేషం. కాగా, ఈ కేసు విచారణ రెండు నగరాల్లో ఏకకాలంలో నిర్వహిస్తున్నందున గతంలో ఈ రికార్డులను ముంబయి కోర్టుకు పంపించారు.

ఇజ్రాయిల్‌లో ఉగ్రదాడి ?

- 10 మందికి గాయాలు

జెరూసలేం : ఇజ్రాయిల్‌లోని హైఫా నగరంలో ఒక వాహనం పాదచారులపైకి దూసుకెళ్లిన ఘటనలో 10 మంది గాయపడ్డారు. ఈ ఘటనను ఉగ్రదాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. నగరంలోని కర్కూర్ జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న వాహనాన్ని పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా, ఆ వాహనం ఆగకుండా పాదచారులపై దూసుకెళ్లింది. డ్రైవర్‌ను వెంటనే ఆదుపులోకి తీసుకున్నామని, విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో డ్రైవర్ ఉద్దేశపూర్వకంగానే పాదచారులపైకి దూసుకెళ్లాడని వెల్లడైనట్లు చెప్పారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

రెండు ఉపగ్రహాలను ప్రయోగించిన చైనా



బీజింగ్ : లాంగ్ మార్చ్-2సి క్యారియర్ రాకెట్‌తో గురువారం రెండు ఉపగ్రహాలను చైనా విజయంతంగా ప్రయోగించింది. వాయువ్య చైనాలో జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి చైనా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 3:08 గంటలకు ఈ రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. సివేయ్ గావోజింగ్-1 03, సివేయ్ గావోజింగ్-1 04లను వాటి వాటి కక్ష్యల్లోకి విజయవంతంగా పంపింది. కాగా, లాంగ్ మార్చ్ సిరీస్ రాకెట్లల్లో ఇది 561వ ప్రయోగం.

దాతృత్వంతో పేదరిక నిర్మూలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేటు రంగం, దాతృత్వ సంస్థలు కలిసి సమాజంలో కొన్ని లక్ష్యాల సాధన కోసం పనిచేస్తున్నాయి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిల్టీ కింద చేపట్టే కార్యక్రమాలను ఇతర దాతలు, ప్రభుత్వ సహకారంతో మరింత విస్తృతంగా చేపట్టడం దీనికో ఉదాహరణ. ఈ కార్యక్రమం ఫలితంగా సంక్షేమరంగ బాధ్యత నుండి ప్రభుత్వం క్రమేణా తప్పుకుని, దాతల, కార్పొరేట్ల విచక్షణకు వదిలివేసే అవకాశం ఉంది.

అనుసంధానమే ప్రభుత్వ పాత్ర

లబ్దిదారుల ధ్రువీకరణ పూర్తయిన తరువాత సమృద్ధి బంధనమ్ ఫ్లాట్‌ఫామ్‌లో ఆయా కుటుంబాల వివరాలను పొందుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. లబ్ధి పొందాల్సిన కుటుంబాలతో సాయం చేసే కుటుంబాలను అనుసంధానించడమే ప్రభుత్వ పాత్రగా ఉండనుంది. ఎక్కడా ప్రభుత్వం నేరుగా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదని, మ్యాచింగ్, ఎనర్జింగ్, ట్రాకింగ్ వరకే ప్రభుత్వ పాత్రని అధికారులు సిఎంకు వివరించారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి 5 లక్షల అభిలాషి కుటుంబాలను సమృద్ధి బంధనమ్ ఫ్లాట్‌ఫామ్ కిందకు తీసుకురావాలని ఈ సందర్భంగా సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీనియర్ అధికారులు పియూష్‌కుమార్, కాటంనేని భాస్కర్, ప్లానింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రాంతీయ భాషలను మింగేస్తున్న హిందీ

- బలవంతపు హిందీ వల్ల 25 భాషలు కనుమరుగు
- తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శలు



చెన్నై : ప్రాంతీయ భాషలను హిందీ భాష మింగేస్తోందని, దేశవ్యాప్తంగా హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తుండటంతో పలు ప్రాంతీయ భాషలు ఉనికి లేకుండా పోతున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. బలవంతంగా ప్రజలపై హిందీని రుద్దేందుకు చేసిన ప్రయత్నాలు, చేపడుతున్న చొరవలతో ప్రాచీనమైన పలు మాతృభాషలు గల్లంతయ్యాయని ఆయన విమర్శించారు. ఆ మాతృభాషల స్థానాన్ని హిందీ ఆక్రమించడంతో నెమ్మదిగా ప్రాచీనమైన ఆ ప్రాంతీయ మాతృ భాషలన్నీ కనుచూపు మేరలో వినిపించకుండా పోయాయన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇలా ఎన్ని భాషలు అదృశ్యమయ్యాయో మీకు తెలుసా అంటూ ఇతర రాష్ట్రాల్లోని సోదర సోదరీమణులను ఆయన ప్రశ్నించారు. భోజ్‌పురి, మైథిలి, అవాధి, బ్రజ్, బుందేలి, గర్వ్వాలీ, కుమౌని, మాఘి, మార్వ్వారి, మాల్వి, చత్తీస్‌ఘరి, సంథాలి, ఆంగిక, హెూ, ఖరియా, ఖోర్తా, కుర్మాలి, కురుఖ్, ముందారి ఇలా దాదాపు 25 భాషలు గత వందేళ్ళలో ఆచూకీ లేకుండా పోయాయని, అవి 'మనుగడ కోసం గాలిస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. ఇలా హిందీని బలవంతంగా ప్రజలపై రుద్దే ప్రయత్నాల వల్ల చాలా నష్టం జరుగుతోందన్నారు.

ఉత్తరప్రదేశ్, బీహార్ హిందీ రాష్ట్రాలు కావు...

ఉత్తరప్రదేశ్, బీహార్‌లు ఎన్నటికీ హిందీ రాష్ట్రాలు కాదని, వాటిలోనూ హిందీని బలవంతంగా జొప్పించారని స్టాలిన్ తెలిపారు. ఆ రాష్ట్రాల నిజమైన మాతృభాషలు గతకాలపు అవశేషాలుగా మిగిలిపోయాయన్నారు. 'ఇది ఎక్కడ ముగుస్తుందో మాకు తెలుసు.' అంటూ అందుకే తమిళనాడు దీన్ని ప్రతిఘటిస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. "తమిళం మేల్కొంది, తమిళుల సంస్కృతి కాపాడబడింది.' అని వ్యాఖ్యానించారు. తమిళంలో కొన్ని మాటలను ఆయన ఆ పోస్ట్‌లో పంచుకున్నారు. హిందీ భాషను బలవంతంగా ప్రజలపై రుద్దే విషయమై ఆయన డిఎంకె పార్టీ కార్యకర్తలకు మూడో లేఖ రాశారు. రాజకీయ రంగంలో డిఎంకెను తీవ్రంగా వ్యతిరేకించే రాజకీయ పార్టీలు కూడా హిందిని వ్యతిరేకిస్తాయని చెప్పారు. కేంద్రం తీసుకువచ్చిన త్రి భాషా విధానాన్ని కూడా ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇందులో భాగంగా హిందీ లేదా సంస్కృతాన్ని తప్పనిసరిగా నేర్చుకోవాలని ఆదేశించడం లేదని, మరే ఇతర రాష్ట్రాల ప్రాంతీయ భాషనైనా నేర్చుకోవచ్చునని ఆ విధానం పేర్కొంటుందని బిజెపి, దాని మద్దతుదారులు చేస్తున్న వాదనను స్టాలిన్ తిప్పికొట్టారు. ఒకసారి దీన్ని పరిశీలిస్తే చాలా రాష్ట్రాల్లో హిందీ లేదా సంస్కృతానికే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితి ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. బిజెపి పాలిత రాజస్థాన్‌లో ఉర్దూ టీచర్ల స్థానే సంస్కృత టీచర్లను నియమించినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. తమిళనాడు త్రిభాషా సూత్రాన్ని ఆమోదిస్తే, మాతృభాష బహిష్కరించబడుతుందని, భవిష్యత్తుల్లో 'సంస్కృతీకరణ పథకం' అమలవుతుందని స్టాలిన్ విమర్శించారు.

సిల్లీ వ్యాఖ్యలు : బిజెపి

కాగా, స్టాలిన్ విమర్శలను సిల్లీ వ్యాఖ్యలుగా బిజెపి కొట్టేపారేసింది. ప్రత్యేకంగా ఏ ఒక్క రాష్ట్రంలో ఏ ఒక్క భాషను రుద్దేలా కొత్త విద్యా విధానాన్ని తీసుకురాలేదని పేర్కొంది. అనవసరంగా తమిళనాడు ప్రభుత్వం ఇటువంటి రాజకీయ వైఖరి తీసుకుందని విమర్శించింది. కేంద్ర మంత్రి అశ్వినీ కుమార్ మాట్లాడుతూ తమిళనాడులో డిఎంకె ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే స్టాలిన్ ఇలాంటి భాషా పరమైన విభజనకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. 'అతను (రాహుల్) హిందీ మాట్లాడే నియోజకవర్గానికి (యుపిలోని రాయ్‌బరేలి) చెందినవారన్న సంగతి అంగీకరిస్తారా?' అని అశ్వినీ కుమార్ పేర్కొన్నారు.

ప్రధాని మోడీ డిగ్రీ వివాదం డియు పిటీషన్‌పై తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బ్యాచిలర్ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని బహిర్గతం చేయాలనే కేంద్ర సమాచార కమిషన్ (సిఐసి) ఆదేశాలను సవాల్ చేస్తూ ఢిల్లీ విశ్వవిద్యాలయం (డియు) దాఖలు చేసిన పిటీషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు గురువారం రిజర్వ్ చేసింది. 'వాదనలు విన్నాం. తీర్పును రిజర్వ్ చేశాం' అని జడ్జి సచిన్ దత్తా ఇరు పార్టీలకు తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద నీరజ్ అనే వ్యక్తి దాఖలు చేసిన దరఖాస్తు ప్రకారం ఢిల్లీ యూనివర్శిటీలో 1978లో బిఎ పరీక్ష ఉత్తీర్ణులైన అందరి రికార్డులు తనిఖీ చేయడానికి సిఐసి 2016 డిసెంబర్ 21న అనుమతి ఇచ్చింది. ఇదే ఏడాదిలో మోడీ డిగ్రీ ఉత్తీర్ణులైనట్లు ఆయన తన రికార్డుల్లో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ యూనివర్శిటీ నుంచి వివరాలు కోరుతూ ఆర్‌టిఐ దరఖాస్తు దాఖలైంది. ఈ వివరాలు ఇవ్వలేమంటూ డియు హైకోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ ఉత్తర్వులపై హైకోర్టు 2017 జనవరి 23న స్టే విధించింది. ఎలాంటి ప్రజాప్రయోజనం లేకుండా కేవలం ఆసక్తితో ఆర్‌టిఐ చట్టం కింద ప్రైవేటు సమాచారాన్ని కోరే హక్కులేదని డియు వాదిస్తుంది. డియు తరుపున గురువారం విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ 'కోర్టుకు రికార్డులను చూపించడంలో విశ్వ విద్యాలయానికి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపారు. సిఐసి ఉత్తర్వులను కొట్టివేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

వక్ఫ్ బిల్లు సవరణలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణల బిల్లు పరిశీలనకు ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) సూచించిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో మార్చి 10న ప్రారంభం కానున్న రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బిజెపి ఎంపి జగదాంబిక పాల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జెపిసి కమిటీ కేంద్ర వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చడం, వివాదాలకు సంబంధించిన విచారణలను జిల్లా కలెక్టర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగికి అప్పగించడం, రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ముస్లిం ఒబిసి వర్గం నుంచి ఓ వ్యక్తిని నియమించి, ఆయన అధికారాలను విస్తృతం చేయడం వంటి ప్రతిపాదనలను సూచించింది. అయితే జెపిసిలో ప్రతిపక్షాలకు చెందిన సభ్యుల విన్నపాలను ఏమాత్రం పట్టించుకోకుండా కమిటీ నుంచి వారిని సస్పెండ్ చేయడం వంటి వివాదాల నడుమ అదే జెపిసి సమర్పించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేయడం గమనార్హం. జెపిసి నివేదికను ఫిబ్రవరి 13న పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశాయి. జనవరిలో అధికార బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సభ్యులు ప్రతిపాదించిన అన్ని సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే క్లాజుల వారీగా చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పునూ తిరస్కరించింది. 44 సవరణలను ప్రతిపాదించగా, ఎన్‌డిఎ సభ్యులు సూచించిన 14 మార్పులను ప్యానెల్ ఓటింగ్‌తో ఆమోదించింది.

బిల్లులోని కీలక నిబంధనలలో రాష్ట్ర వక్ఫ్ బోర్డులకు కనీసం ఇద్దరు ముస్లిమేతర సభ్యులను నియమించడం, ఒక ఆస్తి వక్ఫ్ ఆస్తిగా అర్హత పొందుతుందో లేదో నిర్ణయించడానికి ఒక ప్రభుత్వ అధికారిని అనుమతించడం వంటివి ఉన్నాయి. చర్చల అనంతరం జెపిసి తన తుది నివేదికను జనవరి 30న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. ఆమోదిత సవరణలను కలుపుకొని సవరించిన బిల్లును జనవరి 29న ప్యానెల్ అధికారికంగా ఆమోదించింది. మొదట్లో 2024 నవంబర్‌లో జరిగే శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టాలని భావించినప్పటికీ, వివరణాత్మక సమీక్ష కోసం ఈ బిల్లును జెపిసికి పంపిన సంగతి విదితమే.

అమెరికాకు రష్యా క్షిపణి ఫోబియా

ఎఫ్-400 విశిష్టతలపై భయాందోళనలు



న్యూఢిల్లీ : భారత వైమానిక దళానికి ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించిన సందర్భంగా ఆ దేశాధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ దీనిపై ఓ ప్రకటన చేశారు. భారత్‌పై అమెరికాకు ఇంత ప్రేమ ఏమిటని ఆరా తీస్తే ఆ దేశానికి పట్టుకున్న 'ఎస్-400' ఫోబియాయే కారణమని స్పష్టమవుతోంది.

రష్యాకు చెందిన అల్మజ్-అంటే ఎస్-400 క్షిపణులను భారత్ కొనుగోలు చేస్తోంది. ఇవి ఉపరితలం నుండి గగనతలంలోకి ప్రయోగించే మొబైల్ దీర్ఘ శ్రేణి, బాలిస్టిక్ నిరోధక వ్యవస్థకు సంబంధించిన క్షిపణులు. వీటిలో ఇప్పటికే మూడు క్షిపణులను వైమానిక దళం మోహరించింది. మరో రెండు క్షిపణులు ఈ ఏడాది చివరి నాటికి రష్యా నుంచి మన దేశానికి చేరతాయి.

ఎస్-400 విశేషాలు

అమెరికాకు సంబంధించినంత వరకూ ఎస్-400 క్షిపణులు ఎఫ్-35 యుద్ధ విమానాలకు నిజమైన, విశ్వసనీయమైన సవాలు విసురుతున్నాయి. ఎందుకంటే ఎస్-400 క్షిపణులకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఇవి యుద్ధ విమానాలు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులను గుర్తించి నాశనం చేస్తాయి. వీటి పరిధి 400 కిలోమీటర్ల వరకూ ఉంటుంది. 10-30 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదిస్తాయి. ఒకేసారి 80 లక్ష్యాల వరకూ గుర్తించి వాటిలో 36 లక్ష్యాలకు గురి పెడతాయి. ఈ లక్ష్యాలలో ఎఫ్-35 యుద్ధ విమానాలు కూడా ఉన్నాయి. ఎఫ్-400 క్షిపణిలోని అత్యాధునిక రాడార్ వ్యవస్థలు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తాయి. ఈ క్షిపణులు ఇతర గగనతల రక్షణ వ్యవస్థలతో కూడా కలిసి పనిచేయగలవు.

అందుకే ఆందోళన

ప్రపంచంలోని గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థల్లో ఇది ఒకటి. ఇన్ని విశేషాలు, విశిష్టతలు ఉన్న ఎస్-400 క్షిపణుల పేరు వింటేనే అమెరికా భయపడి పోతోంది. ఆ భయం ఏ స్థాయిలో ఉన్నదంటే 2019 జులైలో తన ఎఫ్-35 కార్యక్రమం నుండి నాటో భాగస్వామి టర్కీని తొలగించింది. రష్యా నుంచి టర్కీ రెండు క్షిపణులను మోహరించడంతో ఐదవ తరానికి చెందిన వంద యుద్ధ విమానాల కొనుగోలుకు ఇచ్చిన ఆర్డర్‌ను అమెరికా రద్దు చేసుకుంది. ఎఫ్-35లోని రాడార్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎస్-400 క్షిపణి సేకరిస్తుందని, దాని సాయంతో గగనతల రక్షణ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుకొని లక్ష్యాలను మరింత సమర్థవంతంగా ఢీకొంటుందని కూడా అమెరికా కలవరపడుతోంది.

టర్కీపై ఆంక్షలు

ఎఫ్-35 యుద్ధ విమానాల భద్రతకు ఎస్-400 క్షిపణులు విఘాతం కలిగిస్తాయని అమెరికా ఆందోళన చెందుతోంది. రష్యా నుంచి క్షిపణులను కొనుగోలు చేసిందన్న అక్కసుతో గతంలో టర్కీపై అమెరికా పలు ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు నాటో దేశాల మధ్య రక్షణ కొనుగోళ్లు, ద్వైపాక్షిక వాణిజ్యానికి ఇబ్బందిగా ఉన్నందున వాటిని తొలగించాలని టర్కీ అధ్యక్షులు తయ్యిప్ ఎర్డోగన్ గత సంవత్సరం చివరలో అభ్యర్థించినప్పటికీ అమెరికా పట్టించుకోలేదు.

ఒత్తిడే కారణమా?

ఇటీవల బెంగళూరులో జరిగిన ఏరో ఇండియాలో ఎఫ్-35 యుద్ధ విమానాలను కూడా ప్రదర్శించారు. అదే సమయంలో ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఇది కాకతాళీయమే అయినా ఎఫ్-35 విమానాలను భారత్‌కు విక్రయించేందుకు అమెరికా చూపుతున్న ఆసక్తిని బయటపెడుతోంది. అయితే ఈ విమానాల కొనుగోలుకు సంబంధించి నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ ఇప్పటి వరకూ రాలేదని అధికారులు చెబుతున్నారు. కానీ వీటిని కొనుగోలు చేయాల్సిందిగా భారత్‌పై తీవ్రమైన ఒత్తిడి వస్తోందని ప్రైవేటు సంభాషణల్లో అంగీకరిస్తున్నారు.

నలుగురు బందీల మృతదేహాలను అప్పగించిన హమాస్

- వందలాదిమంది పాలస్తీనా ఖైదీలు విడుదల

గాజా : తమ చెరలో వున్న నలుగురు బందీల మృతదేహాలను హమాస్, గురువారం తెల్లవారు జామునే రెడ్‌క్రాస్‌కు అప్పగించింది. మరోవైపు ఇజ్రాయిల్ జైళ్ళ నుండి వందలాదిమంది పాలస్తీనా ఖైదీలు విడుదలయ్యారు. మరికొద్ది రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందం ముగియనుంది. మొదటి దఫా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఇరు పక్షాలు నిబంధనలకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తించాల్సి వుంది. ఇప్పటివరకు హమాస్ 33 మంది బందీలను అప్పగించగా, వీటిలో 8 మృత దేహాలు వున్నాయి. కాగా ఇజ్రాయిల్ దాదాపు 2 వేల మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది. కాగా మృతదేహాల గుర్తింపు ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు ఇజ్రాయిల్ అధికారులు వెల్లడించారు. ఇజ్రాయల్ జైళ్ళ నుండి 456 మంది పాలస్తీనియన్లు విడుదల కాగా, వారిలో 97 మందిని ఈజిప్ట్‌కు తరలించారు. 37 మంది వెస్ట్ బ్యాంక్ చేరుకున్నారు. మరో ఐదుగురు ఆక్రమిత తూర్పు జెరూసలేం వెళ్ళారు. 24మంది చిన్నారులతో సహా మరికొంతమంది ఇంకా విడుదల కావాల్సి వుందని వారి విడుదల ప్రక్రియలో ఇజ్రాయిల్ కావాలనే జాప్యం చేస్తోందని హమాస్ విమర్శించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో వున్నప్పటికీ గత 48 గంటల్లో గాజా ఆస్పత్రులకు 17 మృతదేహాలు వచ్చాయి. 19 మంది గాయపడినవారు చికిత్స పొందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. రెండో దఫా కాల్పుల విరమణ చర్చల కోసం కైరోకు వెళ్ళాల్సిందిగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తమ ప్రతినిధి బృందాన్ని ఆదేశించారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఈ వారాంతానికి మొదటి దఫా ఒప్పందం ముగియనుంది. దాంతో రెండో విడత ఒప్పందంపై చర్చలు ముమ్మరమయ్యాయి. కాగా, రెండో దశ ఒప్పందం కుదుర్చుకునే విషయంలో ఇజ్రాయిల్ చిత్త శుద్ధితో వ్యవహరించడం లేదని హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యులు బసీమ్ నయీమ్ విమర్శించారు. బదులుగా సైనిక దాడులను ముమ్మరం చేయాలని భావిస్తోందన్నారు. గాజాకు ఈజిప్ట్‌తో గల సరిహద్దు పొడవునా గల ఫిలడెల్ఫి కారిడార్ నుండి ఇజ్రాయిల్ మిలటరీ వైదొలగేది లేదని ఇజ్రాయిల్ మీడియా వర్గాలు తెలిపాయి.

ట్రంప్ తొలి కేబినెట్ భేటీ!

- ప్రశ్నించే మీడియా సంస్థలకు నో ఎంట్రీ

వాషింగ్టన్ : రెండో పదవీ కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం మొదటి కేబినెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశం కవరేజీకి కొన్ని మీడియా సంస్థలను వైట్‌హౌస్‌లోకి అనుమతించలేదు. మీడియా కవరేజీపై ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానానికి అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకువచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

అయితే ట్రంప్ విధానాలను విమర్శిస్తూ కథనాలను రాసిన మీడియా సంస్థలను, ప్రశ్నించే మీడియా ప్రతినిధులను ఉద్దేశపూర్వకంగానే అనుమతించలేదన్న విమర్శలు వస్తున్నాయి. రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్, హఫ్‌పోస్ట్, జర్మనీ వార్తాపత్రిక అయిన డెర్ తెగస్పిగల్‌లకు చెందిన విలేకర్లను, ఫోటోగ్రాఫర్లను అనుమతించలేదు. కేవలం ఎబిసి, న్యూస్‌మాక్స్, ది బ్లేజ్, బ్లూమ్‌బెర్గ్ న్యూస్, ఎన్‌పిఆర్, యాక్సియోస్‌లకు చెందిన వారిని మాత్రమే అనుమతించారు. ఓవల్ ఆఫీసు వంటి చిన్న చిన్న ప్రదేశాల్లో నిర్వహించే పత్రికా సమావేశాలకు ఎవరెవరినీ పిలవాలనే అంశంపై వైట్‌హౌస్ నిర్ణయం తీసుకుంటుందని మంగళవారం ట్రంప్ ప్రభుత్వం వెల్లడించింది. సాంప్రదాయ మీడియా సంస్థలను ట్రంప్ రోజువారీ కార్యక్రమాల కవరేజికి అనుమతిస్తామని వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కెరొలిన్ లెవిట్ తెలిపారు. కాగా ఈ చర్యను ఎపి, బ్లూమ్‌బెర్గ్, రాయిటర్స్ మీడియా సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు మూడు సంస్థలు ఒక ప్రకటన జారీ చేశాయి. ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం స్వేచ్ఛాయుతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలని పేర్కొన్నాయి. పత్రికా స్వేచ్ఛను ఇది దారుణంగా ఉల్లంఘించడమేనని హఫ్‌పోస్ట్ పేర్కొంది. రాజకీయ వైఖరులతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల పాఠకులకు సకాలంలో, కచ్చితమైన వార్తలను అందించడానికే తాము కృషి చేస్తూ వుంటామని, అటువంటి ఈ చర్యలు సముచితం కాదని పేర్కొన్నాయి.

టారిఫ్‌లు ఆపేది లేదు..

కెనడా, మెక్సికోలపై అనుకున్న ప్రకారమే ఏప్రిల్ 2 నుండి 25శాతం టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని ట్రంప్ చెప్పారు. ఆ రెండు దేశాల సరిహద్దుల నుండి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించే వారి సంఖ్య తగ్గిందని ఆయన చెప్పారు. అయితే అంత మాత్రాన ఆ దేశాలపై సుంకాలు విధించకుండా ఆగేది లేదని స్పష్టం చేశారు. ఏప్రిల్ 2 నుండి చాలా అద్భుతాలు మీరు చూడబోతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో సరిహద్దుల గుండా అక్రమంగా లోపలకు ప్రవేశించేవారు 90శాతం వరకు క్షీణిస్తే టారిఫ్‌లకు విరామం ప్రకటిస్తారా అని ఒక విలేకరి ప్రశ్నించారు. టారిఫ్‌లను ఆపేది లేదని తేల్చి చెప్పారు. మెక్సికో ఆర్థిక వ్యవహారాల శాఖ దీనిపై వ్యాఖ్యానించడానికి తిరస్కరించగా, అవసరమనుకుంటే ఇయు సరైన రీతిలో స్పందిస్తుందని ఫ్రెంచ్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు.



ఈశాన్య ఢిల్లీ మత ఘర్షణలకు ఐదేళ్లు

- బాధితులకు న్యాయం జరిగేదాకా పోరాటం
- సంఘీభావ సభలో బృందాకరత్

న్యూఢిల్లీ : సంఘ్ పరివార్ కుట్రలతో ఈశాన్య ఢిల్లీలో చెలరేగిన మత ఘర్షణలకు ఐదేళ్లు పూర్తయ్యాయి. మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని సంఘ్ పరివార్ సాగించిన నాటి హింసాత్మక దాడుల్లో బాధితులైనవారి పక్షాన నిలబడి న్యాయం కోసం సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కమిటీ పోరాటం సాగించింది. బాధిత కుటుంబాలకు స్వయం ఉపాధి శిక్షణ ఏర్పాటు చేసి ఆర్థికంగానూ చేయూతనందించింది. ఈ ఐదేళ్లూ వారికి అండదండలను అందిస్తూ వచ్చింది. ఇక ముందు కూడా న్యాయం కోసం తాము అండగా నిలబడతామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ తెలిపారు. ఢిల్లీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముస్తఫాబాద్‌లో గురువారం నిర్వహించిన సంఘీభావ సభలో ఆమె ప్రసంగించారు. ఐదేళ్ల క్రితంనాటి గాయాలను మళ్లీ రేపాలని తాము అనుకోవడం లేదని, నాటి బాధితులకు సంఘీభావంగా నిలిచి, న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరముందని ఆమె అన్నారు. నాటి మత హింసకు కారణమైనవారు ప్రస్తుత ఢిల్లీ కేబినెట్‌లో కూర్చున్నారని, బాధితులు మాత్రం నేటికీ న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆమె అన్నారు. 'నాడు సిపిఎం మీ పక్షాన నిలబడింది. ఇక ముందు మీకు అండగా నిలబడుతుంది' అని సభకు హాజరైన బాధితులను ఉద్దేశించి బృందాకరత్ భరోసా ఇచ్చారు. 'ఇది ఒక హింస కాదు, ఏకపక్ష దాడి. 76 శాతం మరణాలు మైనారిటీ తరగతి నుంచే ఉన్నాయి. ఆస్తి నష్టంలోనూ 60 శాతం వారిదే. 751 ఎఫ్‌ఐఆర్‌ల ప్రకారం.. దాడులకు కారణమైనవారి అరెస్టులు ఎక్కువగా జరగడం లేదు. బాధితులనే అరెస్ట్ చేశారు. పరిహారం పూర్తిగా అందించలేదు. పరిహారానికి ఉద్దేశించిన ప్రమాణాలలో లోపాలున్నాయి" అని బృందా కరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ రాష్ట్ర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు చట్టాలు చేస్తే సరిపోదు.. పటిష్ట అమలు కీలకం!

- మాజీ సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు



ముంబయి : కేవలం చట్టాలు చేయడం వల్ల మహిళలపై నేరాలు జరగడం ఆగిపోవని, వాటిని సక్రమంగా అమలు చేస్తేనే ఆగుతాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. పూనే బస్సులో మహిళపై అత్యాచారం జరిగిన సంఘటనపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆయన 2012 నాటి నిర్భయ సంఘటనను గుర్తు చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబయిలో ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పూనే బస్సు సంఘటన గురించి విలేకర్లు ప్రశ్నించగా..మహిళల కోసం చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేయగలిగితేనే ఇటువంటి లైంగిక వేధింపుల సంఘటనలు నివారించగలుగుతామని అన్నారు. ఆనాటి నిర్భయ సంఘటన తర్వాత చట్టాల్లో చాలా మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇటువంటి చట్టాలు చేసినంత మాత్రాన నేరాలు ఆగిపోవు, చట్టాలు రూపొందించడంతో పాటూ వాటిని అమలు చేసే విధానం కూడా అత్యంత కీలకమని, అలాగే సమాజం బాధ్యత కూడా చాలా బృహత్తరమైనదని ఆయన వ్యాఖ్యానించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పనుల కోసం బయటకు వెళుతున్నారు. అటువంటపుడు వారి కోసం చేసే చట్టాలు వారు సురక్షితంగా వున్నామని భావించేలా అమలు చేయాలన్నారు. సక్రమ దర్యాప్తు, గట్టి చర్యలు, శీఘ్రగతిన విచారణ, శిక్ష విధింపు వంటి చర్యలు తీసుకోవాల్సి వుందన్నారు. ఇందులో చట్టపరమైన వ్యవస్థ, పోలీసులకు బృహత్తరమైన బాధ్యత వుందని అన్నారు. మహిళలు వారి ఉద్యోగాలను సురక్షితంగా చేసుకోగలిగేలా మనం ప్రతి స్థాయిలోనూ దీని గురించి అత్యంత జాగ్రత్తగా ఆలోచించాలన్నారు. సమ సమాజం యొక్క ప్రాథమిక విధి ఇదని ఆయన వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్ ఐదు ప్రాంతాలపై చర్చల్లేవ్ !

- తేల్చి చెప్పిన రష్యా

మాస్కో : ఉక్రెయిన్‌కి చెందిన ఐదు ప్రాంతాల హెూదాపై ఎలాంటి చర్చలు జరిపేది లేదని రష్యా గురువారం తేల్చి చెప్పింది. వాటిల్లో నాలుగు ప్రాంతాలపై పూర్తి స్థాయిలో నియంత్రణ లేకపోయినా వాటిని విలీనం చేసుకున్నట్లు తెలిపింది. రష్యన్ సమాఖ్యలో భాగంగా మారిన ఆ ప్రాంతాలు తమ దేశంలో విడదీయరానివని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ విలేకర్లకు చెప్పారు. ఇది తిరస్కరించడానికి వీల్లేని, చర్చించనవసరం లేని అంశమని ఆయన స్పష్టం చేశారు. 2014లో క్రిమియా ప్రాంతాన్ని రష్యా స్వాధీనం చేసుకుంది. పూర్తి స్థాయి సైనిక దాడుల అనంతరం 2022 సెప్టెంబరులో నాలుగు ఉక్రెయిన్ ప్రాంతాలైన డాంటెస్క్, లుగాన్స్క్, జపోరిజిజియా, ఖెర్సాన్‌లను రష్యాలో విలీనం చేసినట్లు ప్రకటించింది. డాంటెస్క్, లుగాన్స్క్‌ల్లో చాలా ప్రాంతాల్లో రష్యా బలగాలకు నియంత్రణ వుంది. కానీ మిగిలిన రెండు చోట్ల కేవలం కొన్ని భూభాగాలపై మాత్రమే పట్టు వుంది.

అధికార అక్రమాలు

(మొదట పేజీ తరువాయి)

పిడిఎఫ్ ఏజెంట్లకు బయటకు వెళ్లాలని టిడిపి నేతలు హుకుం జారీ చేశారు. ఇందుకు పిడిఎఫ్ ఏజెంట్లు ససేమిరా అనడంతో ప్రజాసంఘాల నాయకులు కొమ్ముల నాగేశ్వరరావుపై దాడికి పాల్పడ్డారు. మరో పిడిఎఫ్ ఏజెంట్‌ను దుర్భాషలాడారు. వెల్దుర్తి, దుర్గిలో పిడిఎఫ్ ఎజెంట్లను టిడిపి వారు బయటకు లాగేశారు. బెల్లంకొండలో పిడిఎఫ్ ఏజెంటుపై దౌర్జన్యం చేశారు. అయితే, పోలీసులు అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి పిడిఎఫ్ ఏజెంటుపై తప్పు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణం, వెల్దుర్తి, విజయపురిసౌత్ పోలింగ్ కేంద్రాల్లో పిడిఎఫ్ అభ్యర్థి ఏజెంట్లను మధ్యాహ్నం రెండు గంటలకే దౌర్జన్యంగా బయటకు పంపేశారు. వెల్దుర్తిలో పిడిఎఫ్ ఏజెంటును అనుమతించలేదు. గుంటూరు చలమయ్య కళాశాలలో పిడిఎఫ్ ఏజెంటు కార్తిక్‌పై జనసేన కార్యకర్తలు దౌర్జన్యం చేశారు. విజయవాడ గాంధీజి మున్సిపల్ హైస్కూలు, భవాని పురంలోని పలు పోలింగ్ బూత్‌లలోకి టిడిపి పశ్చిమ నియోజకవర్గ నేత బుద్దా వెంకన్న దౌర్జన్యంగా ప్రవేశించారు.

పిఠాపురంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ -వీడియో వైరల్

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణంలో టిడిపి నాయకులు డబ్బులు పంచుతూ మీడియాకు చిక్కారు. ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 96, 97, 93 పోలింగ్ బూత్‌లకు అతి సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో టిడిపి పిఠాపురం మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్ ఓటర్లకు స్వయంగా డబ్బులు పంపిణీ చేశారు. బెంగళూరు, హైదరాబాదు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు వచ్చిన వారికి నగదు పంపిణీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో, తహశీల్దార్ పి.గోపాకృష్ణ, పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్ అక్కడికి చేరుకోవడంతో టిడిపి నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై తహశీల్దార్ మాట్లాడుతూ తాము వెళ్లేసరికి డబ్బులు పంచుతూ ఎవరూ కనిపించలేదని, అక్కడి వారిని పోలీసులు చెదరగొట్టి కల్యాణ మండపానికి తాళాలు వేశారని తెలిపారు.

యలమంచిలిలో పోలింగ్ బూత్‌ల్లోకి అనుచరులతో మంత్రి నిమ్మల

మంత్రి నిమ్మల రామానాయుడు పశ్చిమగోదావరి జిల్లాలోని యలమంచిలి మండల కేంద్రంలోని 432 పోలింగ్ కేంద్రంలోకి పదుల సంఖ్యలో తన అనుచరులతో వెళ్లి నిబంధనలు ఉల్లంఘించారు. అయినా, పోలీసులుగానీ, ఎన్నికల అధికారులుగానీ అడ్డు చెప్పలేదు.

విశాఖలో పోలింగ్ బూత్‌లో గంటా హల్‌చల్

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని చంద్రంపాలెం హైస్కూల్ పోలింగ్ బూత్ నెంబర్ 120లోకి టిడిపికి చెందిన తన అనుచరులతో వెళ్లి హల్‌చల్ చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి లోపలకు ప్రవేశిస్తున్నా పోలీసులు, అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారు.

దాడిని ఖండించిన ఎస్ఎఫ్ఐ

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ కార్యకర్తలపై టిడిపి కూటమి కార్యకర్తలు దాడి చేయడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



మీ కోసం

ఈగలు ఎక్కువగా వస్తున్న ప్రదేశంలో పుదీనా ఆకులను కత్తిరించి పెడితే ఈగల బెడద తగ్గుతుంది.

జీవన సౌరభం

గమ్యం ఎంత దూరంలో ఉన్నప్పటికీ దానిని చేరుకునే మార్గం మాత్రం మొదటి అడుగు నుంచే మొదలవుతుంది.

పెద్దల మాట వినాలి



వేప చెట్టు కింద ఉన్న 50 కుటుంబాలలో చీమయ్య కుటుంబం కూడా ఒకటి. చీమయ్యకి ఇద్దరు పిల్లలు. చాలా సంతోషకరమైన కుటుంబం. చీమలన్నీ తమకి అవసరమైన ఆహారం కంటే ఎక్కువ ఆహారం తెచ్చుకొని మిగిలిన ఆహారాన్ని నిలువ చేసుకునేవి.

చీమయ్యకి తన పిల్లలంటే చాలా ఇష్టం. తనతో పాటు బుద్ధిగా వచ్చి వాటికంటే ఎక్కువ బరువున్న ఆహారం మోస్తున్న తన పిల్లల బలం చూసి పొంగిపోయేవాడు. చీమయ్య ఎప్పుడూ తన పిల్లలకు బుద్ధులు చెబుతూ ఉండేవాడు 'ఐకమత్యమే చీమల అసలు బలమని, బద్ధకం పనికిరాదని, ఎప్పుడూ ఆహారం నిలవ ఉంచుకోవాల'ని చెప్పేవాడు. ఇంకా 'మనిషి జోలికి వెళ్తే చాలా ప్రమాదం అని, ఎప్పుడూ విర్రవీగకూడదని, ఎవర్నీ కుట్టకూడదని' అనేక బుద్ధులు చెబుతూ ఉండేవాడు.

రోజులు సంతోషంగా గడుస్తున్నాయి. నెమ్మదిగా పిల్ల చీమలన్నీ గుంపు కట్ట సాగాయి. ఒకసారి పిల్ల చీమలన్నీ ఆడుతూ ఆడుతూ తమ ఇంటికి దూరంగా వెళ్లాయి. పచ్చికబైళ్ళలో హాయిగా తిరగసాగాయి. వాటిలో చాలా వాటికి తమ శక్తి మీద గర్వం పెరిగింది. 'ఎక్కువ బరువు మోయగలమని, తాము కుడితే ఏ ప్రాణి అయినా తట్టుకోలేక గిలగిలాడతాయని' భావించేవి. అప్పుడు వాటికి దూరంగా మనుషులు కనిపించారు. వాళ్లని చూసిన కొన్ని పిల్ల చీమలు 'పదండి అరుగో అక్కడ మనుషులు ఉన్నారు. వాళ్లను కుట్టి గిలగిలలాడేలా చేద్దాం. మన ప్రతాపం చూపిద్దాం అన్నాయి.

చీమయ్య పిల్లలు ఇద్దరు 'వద్దు మా నాన్న ఎవరినీ ఇబ్బంది పెట్టొద్దు అన్నారు. ముఖ్యంగా మనుషుల జోలికి వెళ్లొద్దు అన్నారు. మాకు చాలా భయం వేస్తోంది. మేము రాము' అన్నాయి.

ఓ కొంటె చీమ మాత్రం 'పెద్దవాళ్లు ముసలి వాళ్లు అయిపోయి ఏవో ఒకటి చెబుతూ ఉంటారు. వాళ్ల మాటలు పట్టించుకోనవసరం లేదు. ఈ మనుషులు కనీసం వాళ్ళ బరువున్న వస్తువుల్ని కూడా మోయలేరు. మనం మన బరువు కన్నా ఎన్నో రెట్లు అధికమైన బరువుని అవలీలగా మోసేస్తాం. ఆ మనుషులు మనల్ని ఏమీ చేయలేరు రండి' అంటూ ముందుకు సాగింది.

అలా అని ఆ కొంటె చీమ ఉత్సాహంగా ముందుకు నడుస్తూ ఉండగా, మిగిలినవి దానిని అనుసరించాయి. పచ్చిక బయలులో తిరుగుతున్న ఇద్దరు మనుషులలో ఒకరి కాలు మీద గట్టిగా కుట్టింది ముందున్న చీమ. మిగిలిన చీమలు కూడా కుట్టాలని ముందుకు రాసాగాయి. అప్పుడే తనను కుట్టిన చీమను చేతితో నలిపి నేలపై పడేసి తన దగ్గరికి వస్తున్న చీమల వరుసపై బూటు కాలు వేసి గట్టిగా నలిపేశాడు ఆ మనిషి.

వెనకున్న గుంపులో ఉన్న చీమలన్నీ భయంతో గడగడ వణుకుతూ, వెనక్కి తిరిగి పిచ్చిగా పరుగెత్తాయి. ఎలాగోలా ఇంటికి చేరుకున్న చీమయ్య పిల్లలు వాళ్ళమ్మను గట్టిగా పట్టుకుని వెక్కివెక్కి ఏడ్చాయి. ఎప్పటికో జరిగిన విషయం చెప్పాయి. 'ఇలాంటి ప్రమాదాలు బయట ఉంటాయనే, మీ నాన్న మిమ్మల్ని ఎప్పుడూ హెచ్చరిస్తూ ఉంటాడు. మీరు చిన్నపిల్లలు కదా లోకంలోని మంచి చెడు మీకు తెలియవు. అందుకే పెద్దలు చెప్పిన మాట వినాలి' అని ధైర్యం చెప్పింది. ఆ మాటలు విన్న పిల్లలు 'ఇంకెప్పుడూ మీకు చెప్పకుండా ఏ పనీ చెయ్యం' అంటూ కన్నీళ్లు తుడుచుకున్నాయి.

- శశి, అజ్జమూరు,
95538 09850.



నేను గీసిన బొమ్మ

- దాసరి తేజ,
3వ తరగతి,
అభ్యాస విద్యాలయం,
విజయవాడ.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

శాస్త్రీయ స్ఫూర్తితో ముందుకు సాగాలి

మానవ ప్రగతికి కారణమైన వాటిలో చక్రం, నిప్పు, ఇంజన్ మొదలైనవి ఉన్నాయి. నిరంతర విజ్ఞాన అన్వేషణతోనే వాటి సృజన సాధ్యమైంది. ఏ దేశ సమగ్రాభివృద్ధిలోనైనా శాస్త్ర, సాంకేతికత రంగాలు కీలకపాత్ర పోషిస్తాయి. ప్రజల జీవన ప్రమాణాలను అవి మరింతగా మెరుగుపరుస్తాయి. ఆయా రంగాల్లో మన దేశం కూడా ప్రపంచ దేశాలతో పోటీపడాలంటే దేశీయంగా పరిశోధనలు, ఆవిష్కరణలు మరింతంగా విస్తృతంగా పెంపొందాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో సైన్స్ పట్ల ఆసక్తిని కల్గించటానికి రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరింపబడిన ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



సైంటిఫిక్ టెంపర్ అనే మాటను జవహర్‌లాల్ నెహ్రూ తన కుమార్తె ఇందిరకు రాసిన లేఖల్లో ఉపయోగించారు. దాన్నే శాస్త్రీయ స్ఫూర్తి అంటున్నాం. శాస్త్రీయ స్ఫూర్తి అధికరణం 51-ఎ (హెచ్) ద్వారా మన రాజ్యాంగంలో పొందుపర్చుకున్నాం. శాస్త్రీయ స్ఫూర్తికి గుర్తుగా భారతదేశం నిర్మించిన తొలి ఉపగ్రహానికి ఆర్యభట్ట 1 అని పేరు పెట్టటం. భారతీయ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహానికి భాస్కర 1 అని పేరు పెట్టుకున్నాం. పరమాణు రహస్యాన్ని క్రీస్తుపూర్వం రెండో శతాబ్దంలో వైశేషిక తత్వచింతన ద్వారా ప్రపంచానికి చాటిచెప్పింది కణాద మహర్షి. ఆర్యభట్ట 1, భాస్కర 1, భాస్కర 2, చరకుడు, సుశ్రుతుడు లాంటి ప్రాచీన భారతీయ శాస్త్రవేత్తల్లాగా శాస్త్రీయ స్ఫూర్తిని నింపుకొన్న అనేకమంది ఉన్నారు.

శాస్త్రీయ స్ఫూర్తి లేని శాస్త్రవేత్తలు ప్రాచీన కాలంలోనూ, ఆధునిక కాలంలోనూ ఉన్నారు. ప్లాస్టిక్ సర్జరీ మన పురాణాల్లో ఉందని రుజువు లేకపోయినా నమ్మబలికే వారు ఉన్నారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు కొందరు మూఢ నమ్మకాలను నమ్మబలుకుతున్నారు. దీనికి కారణం శాస్త్రీయ స్ఫూర్తి లేకపోవడమే!

ప్రతిఒక్కరూ సైన్స్‌ను జీవన విధానంగా మలచుకుంటేనే మంచిగా అభివృద్ధి సాధించగలం. రుజువుల ఆధారంగా నమ్మటం, ప్రశ్నల ఆధారంగా పరిశీలించటం, పరీక్షించటం విజ్ఞానాభివృద్ధికి మూలం. నిరంతర సత్యాన్వేషణ నూతన జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. పరీక్షించకుండా, ప్రయోగం చేయకుండా, రుజువులు లేకుండా సైన్సు దేనినీ అంగీకరించదు. నూతన రుజువులు ముందుకు వచ్చినప్పుడు, గతంలో ఏర్పర్చుకున్న సిద్ధాంతానికి భిన్నమైన నూతన సత్యాలు అనుభవంలోకి వచ్చినప్పుడు, గతంలో ఏర్పర్చుకున్న నిర్ధారణలను సైన్సు మార్చుకుంటుంది. దేనినైనా రుజువైతేనే నమ్మాలి. అలాగే ఏ సమస్య ఎదురైనా శాస్త్రీయ పద్ధతిలో అర్థం చేసుకొని, పరిష్కరించుకోవాలి. అలాంటి ఆలోచననూ, దృక్పథాన్ని జీవన విధానాన్ని, స్వభావాన్ని కల్గివుండటమే శాస్త్రీయ స్ఫూర్తి.

శాస్త్రం : శాస్త్రీయ పద్ధతిలో రుజువైతేనే అది శాస్త్రం.
అశాస్త్రం (నాన్‌సైన్స్) : శాస్త్రీయ పద్ధతిలో రుజువుకాకపోతే అది అశాస్త్రం.
కుహనా శాస్త్రం (సూడోసైన్స్) : రుజువు కాకపోయినా శాస్త్రంగా చలామణి అయితే కుహనా శాస్త్రం. ఇప్పుడు చాలామంది తమ స్వార్థ ప్రయోజనాలకు కుహనా శాస్త్రాన్నే శాస్త్రంగా ప్రజల ముందు ఉంచుతున్నారు. ఎందుకంటే శాస్త్రము అని చెబితే ప్రజలు నమ్ముతారు కదా! అందుకని. నేడు యూట్యూబుల్లో ఇలాంటి తప్పుడు సమాచారం కుప్పలుగా క్రియేట్ అవుతోంది. వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి.

సైన్సులో రహస్యాలు ఉండవు. శాస్త్రవేత్తలు చేసింది, తెలుసుకున్న దాన్ని అందరూ తెలుసుకోవచ్చు. సైన్స్ అంటే పశ్నించడం-సమాధానం తెలుసుకోవడమే. సైన్స్ పద్ధతిలో రోజువారీ జీవితంలో ఎదురైన సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుంది. సైన్స్ అంటే కేవలం భౌతిక, రసాయన, జీవ, గణితశాస్త్రం వంటివి మాత్రమే కాదు. అంతకు మించింది కూడా. ఇది ఆలోచనలూ, ఆ ఆలోచనల విధానానికి సంబంధించింది. ఇదొక వైజ్ఞానిక సంస్కృతి. ఎలాంటి ముందస్తు నిర్ధారణలు లేకుండా సత్యాన్ని అన్వేషించే తత్వం. ఇదొక మానసిక దృక్పథం కూడా. ఇది సైంటిఫిక్ మెథడ్ (శాస్త్రీయ పద్ధతి) ద్వారా ఏర్పడుతుంది. ఈ పద్ధతే అసలైనది, సరైంది. సైన్స్‌లో రెండు అంశాలు ఉంటాయి. ఒకటి జ్ఞానం, రెండోది సరైన పద్ధతి. ఈ రెండు కలిస్తేనే సైన్స్ (విజ్ఞాన శాస్త్రం). సైన్స్ తెలుసుకున్న జ్ఞానాన్ని పద్ధతిగా వాడుకొని సమస్యల్ని పరిష్కరించుకోవాలి. శాస్త్ర సాంకేతిక రంగాలను పొందటం, వినియోగించుకోవటం మాత్రమే కాదు; శాస్త్రీయ దృక్పథాన్ని, స్ఫూర్తిని పెంచుకోవటం చాలా అవసరం.



- ఎ.వి.చలపతి,
జన విజ్ఞాన వేదిక (జెవివి),
నెల్లూరు జిల్లా గౌరవాధ్యక్షులు,
సెల్ : 94903 00906

ప్రశ్నించు .. పరిశీలించు.. నిర్ధారించు ...

- సమస్యను గుర్తించటం
- అది ఎందుకు ఏర్పడిందో ప్రశ్నించటం
- పరిశీలించటం
- సమాచారాన్ని సేకరించడం
- పరిష్కారాన్ని ఊహించటం
- ప్రయోగం చేసి పరీక్షించటం
- సిద్ధాంతీకరించడం

పరీక్షలో రుజువైతే అది సిద్ధాంతమై జ్ఞాన నిధుల్లోకి వస్తుంది. సైన్స్ పుస్తకంలోని జ్ఞానాన్ని, చదివి చెప్పడం కాదు. ఆ పుస్తకంలోని సిలబస్ ఆధారంగా సైన్స్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం. అందుకే ప్రయోగశాలలను పాఠశాలలు, విద్యా సంస్థల్లో అభివృద్ధి చేసుకొని ప్రయోగాత్మక సైన్స్ పద్ధతిలో విద్యార్థి దశ నుంచే శిక్షణ ఇస్తే శాస్త్రీయ స్ఫూర్తి అబ్బుతుంది. అందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషిచేయాలి. పెద్దలకు కూడా వారి జీవితానుభవంలో నుంచి శాస్త్రీయ పద్ధతిని వివరించి, తెలియజేసి శాస్త్రీయ స్ఫూర్తిని పొందేటట్లు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి.

పురోగమనానికి శాస్త్రీయ ఆలోచనలు



శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాం. ఆలోచనలు, భావనల్లో శాస్త్రీయత పాటించాలి. గుడ్డి నమ్మకాలు, మూఢ నమ్మకాలను పక్కన పెట్టేయాలి. సైన్స్, దాని పద్ధతులను జీవన విధానంగా, ఆలోచనా విధానంగా మార్చుకోవాలి. సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించుకోవాలి. ప్రస్తుతం అన్ని రంగాల్లో పురోగతి వంటి శాస్త్ర విజ్ఞాన రంగంలో పరిశోధనల ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశీయంగా యువతరం శాస్త్ర పరిశోధన వైపు ఆకర్షితులయ్యేలా చూడాలి. ప్రాథమిక స్థాయి నుంచే విజ్ఞాన శాస్త్ర భావనలు, విశ్లేషణాత్మక నైపుణ్యాలను బోధించాలి.

- టి.ప్రదీప్‌శాస్త్రి, రీసెర్చ్ స్కాలర్,
డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ,
ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం

హక్కుల కోసం నినదించిన లఘు చిత్రాలకు

మానవ హక్కుల కమిషన్ పురస్కారాలు

- 'ఫైట్ ఫర్ రైట్స్'కు ద్వితీయ బహుమతి
- 'లైఫ్ ఆఫ్ సీత', 'బి - ఎ హ్యూమన్' చిత్రాలకు ప్రత్యేక ప్రశంస

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మానవ హక్కుల పరిరక్షణ, హక్కులపై చైతన్యం కల్పించేందుకు లఘు చిత్రాల రంగం ద్వారా కృషి చేసినవారికి జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సి) 2024 సంవత్సరానికి అందజేసిన బహుమతుల్లో తెలుగు రాష్ట్రాలు సత్తా చాటాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి కడారప్ప రాజు నిర్మించిన 'ఫైట్ ఫర్ రైట్స్' లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. అలాగే మడక వెంటక సత్యనారాయణ రూపొందించిన 'లైఫ్ ఆఫ్ సీత', లోట్ల నవీన్ నిర్మించిన 'బి ఎ హ్యూమన్', తెలంగాణ నుంచి హనీశ్ ఉండ్రమాట్ల రూపొందించిన 'అక్షరాభ్యాసం' చిత్రాలు ప్రత్యేక ప్రస్తావన కింద పురస్కారాలు దక్కించుకున్నాయి.

మానవ హక్కులు అంశంపై తీసిన షార్ట్ ఫిలమ్స్ (చిన్న చిత్రాల)కు 2024 సంవత్సరానికి పదో వార్షిక పోటీలను ఎన్‌హెచ్‌ఆర్‌సి నిర్వహించింది. ఎన్‌హెచ్‌ఆర్‌సి చైర్‌పర్సన్ జస్టిస్ వి రామసుబ్రమణియన్ నేతృత్వంలోని జ్యూరీ పురస్కారాలను ప్రకటించింది. మానవ హక్కులను పరిరక్షించడంతోపాటు మానవ హక్కులకు సంబంధించిన చైతన్యాన్ని వ్యాప్తి చేసే దిశగా ప్రజలు సినిమా మాధ్యమంతో సృజనాత్మక దిశగా ప్రోత్సహించడానికి ఎన్‌హెచ్‌ఆర్‌సి 2015లో షార్ట్ ఫిలిం పోటీలను ప్రవేశపెట్టింది. పదో వార్షిక పోటీల్లో వివిధ భాషలకు చెందిన 303 లఘు చిత్రాలు పాల్గొన్నాయి. వీటిలో వివిధ దశల్లో వడపోతల అనంతరం 243 ఎంట్రీలు పురస్కారాల కోసం బరిలో నిలిచాయి. పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నారు.

జమ్ముకాశ్మీర్‌కు చెందిన ఇంజనీర్ అబ్దుల్ రశీద్ భట్ తెరకెక్కించిన 'దూద్ గంగా - వేలీస్ డయింగ్ లైఫ్‌లైన్' అనే లఘు చిత్రానికి మొదటి బహుమతి దక్కింది. బహుమతి కింద రూ.2 లక్షల నగదు పురస్కారం అందజేస్తారు. దూధ్ గంగ నదిలోని స్వచ్ఛ జలాల్లోకి వ్యర్థాలను యథేచ్ఛగా వదిలివేయడంతో నది నీరు ఎలా కలుషితమైపోతోందన్న ఆవేదనకు చిత్రరూపాన్ని కల్పిస్తూ, లోయలోని ప్రజల మేలు కోసం నదిని ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని ఈ చిత్రం ప్రధానంగా చాటింది.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కడారప్ప రాజు రూపొందించిన 'ఫైట్ ఫర్ రైట్స్'కు ద్వితీయ పురస్కారం దక్కింది. ఈ చిత్రానికి రూ.1.5 లక్షల ప్రోత్సాహం కింద అందజేయనున్నారు. చిన్నతనంలోనే పెళ్లి చేయడం, విద్య అనే అంశాన్ని ఈ చిత్రం చర్చిస్తుంది. ఇక తమిళనాడుకు చెందిన ఆర్ రవిచంద్రన్ రూపొందించిన 'గాడ్' చిత్రాన్ని రూ.లక్ష నగదు ప్రోత్సాహం అందజేసే మూడో బహుమతి దక్కించుకుంది.

ఇక ప్రత్యేక ప్రస్తావన కింద జ్యూరీ నాలుగు చిత్రాలకు బహుమతులు ప్రకటించింది. వీటికి రూ.50 వేల చొప్పున నగదు ప్రోత్సాహం అందజేస్తారు. అవి : తెలంగాణకు చెందిన హనీశ్ రూపొందించిన 'అక్షరాభ్యాసం', తమిళనాడుకు చెందిన ఆర్ సెల్వమ్ రూపొందించిన 'విలయిల్ల పట్టధారి' (విలువ లేని గ్రాడ్యుయేట్), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మడక వెంకట సత్యనారాయణ రూపొందించిన 'లైఫ్ ఆఫ్ సీత', అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లోట్ల నవీన్ తెరకెక్కించిన 'బి - ఎ హ్యూమన్' చిత్రాలు ప్రత్యేక ప్రస్తావన కింద బహుమతులు పొందాయి. వీటిలో లైఫ్ ఆఫ్ సీత చిత్రంలో ధార్మిక సంప్రదాయాల కారణాలతో బాలలు వారి హక్కులను కోల్పోతున్న తీరు, ఈ స్థితిలో సంస్కరణను తీసుకురావాల్సిన అవసరాన్ని ప్రధానంగా చర్చించారు.

సత్తా చాటిన గుజరాత్ బౌలర్లు

- బెంగళూరు మహిళలపై ఆరు వికెట్ల తేడాతో గెలుపు



బెంగళూరు: గుజరాత్ జెయింట్స్ బౌలర్లు తొలిసారి మహిళల ప్రీమియర్ లీగ్‌లో సత్తా చాటారు. చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరుతో మహిళలతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు రాణించి బెంగళూరు బ్యాటర్లను కట్టడి చేశారు. కెప్టెన్ మంధాన, ఎలైసే పెర్రి, రీచా ఘోష్ స్వల్ప స్కోర్‌లకే పరిమితం కావడంతో బెంగళూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 125పరుగులే చేయగల్గింది. గుజరాత్ జెయింట్స్ బౌలర్లు కశ్వీ గౌతమ్, తనూజ కన్వార్, గార్డినర్, డోటిన్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఆ లక్ష్యాన్ని గుజరాత్ అవలీలగా ... ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ గార్డినర్(58) అర్ధసెంచరీకి తోడు లిచ్‌ఫీల్(...) బ్యాటింగ్‌లో రాణించారు. బెంగళూరు బౌలర్లు రేణుక సింగ్, వారేహామ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ మరో చెత్త ప్రదర్శన చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. కెప్టెన్ స్మృతి మంధన 20 బంతుల్లో 10, ఈ సీజన్‌లో భీకర ఫామ్‌లో ఉన్న ఎల్లిస్ పెర్రీ 4 బంతులు ఎదుర్కొని డకౌటైంది. ఓపెనర్ వ్యాట్ హాడ్జ్ 4, రిచా ఘోష్ 9 పరుగులకు ఔటయ్యారు. కనిక అహూజా (28 బంతుల్లో 33), రాఘ్వి బిస్త్ (22), జార్జియా వేర్హమ్ (20 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేయడంతో ఆర్సీబీ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఆఖర్లో కిమ్ గార్త్ (14) రెండంకెల స్కోర్ చేసింది. స్నేహ్ రాణా ఒక పరుగుతో అజేయంగా నిలిచింది. దీంతో బెంగ ళూరు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది. గుజరాత్ బౌలర్లలో కశ్వీ గౌతమ్ (1/17) అద్భుత ప్రదర్శనకు తోడు తనూజా, డోటిన్ రెండేసి వికెట్లతో సత్తా చాటారు.

స్కోర్‌బోర్డు...

బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)హర్లిన్ డియోల్ (బి)రేణుక కన్వార్ 10, వాట్ హోడ్జే (ఎల్‌బి)డోటిన్ 4, ఎలైసె పెర్రి (సి)తనుజ కన్వార్ (బి)గార్డినర్ 0, రఘ్వి బిస్ట్ (రనౌట్) భారతి 22, కనిక అహుజ (సి అండ్ బి)తనూజ కన్వార్ 33, రీచా ఘోష్ (బి)కశ్వీ గౌతమ్ 9, వారేహామ్ (నాటౌట్) 20, కిమ్ గ్రాత్ (సి)బెత్ మూనీ (బి)డోటిన్ 14, స్నేహ్ రాణా (నాటౌట్) 1, అదనం 12. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 125పరుగులు. **వికెట్ల పతనం:** 1/6, 2/16, 3/25, 4/73, 5/78, 6/99, 7/122 **బౌలింగ్:** డోటిన్ 4-0-31-2, గార్డినర్ 4-0-22-1, కశ్వీ 4-0-17-1, తనూజ 4-0-16-2, హేమలత 1-0-4-0,ప్రియా 1-0-18-0, మేఘ్నా 2-0-12-0

గుజరాత్ మహిళల ఇన్నింగ్స్: మూనీ (సి)వారేహామ్ (బి)రేణుక సింగ్ 17, హేమలత (స్టంప్)రీచా (బి)రేణుకా సింగ్ 11, హర్లిన్ డియోల్ (సి)పెర్రీ (బి)వారేహామ్ 5, గార్డినర్ (సి అండ్ బి)వారేహామ్ 58, లిచ్‌ఫీల్డ్ (నాటౌట్) 30, డోటిన్ (నాటౌట్) 0, అదనం 5. (16.3ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 126పరుగులు. **వికెట్ల పతనం:** 1/25, 2/32, 3/66, 4/117 **బౌలింగ్:** రేణుక సింగ్ 4-0-24-2, కిమ్ గ్రాత్ 2.3-0-19-0, స్నేహ్ రాణా 4-0-23-0, రావత్ 1-0-19-0, వారేహామ్ 3-0-26-2, ఎలైసే పెర్రి 1-0-7-0, కనిక అహుజ 1-0-7-0.

2న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం



ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్న 97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 2న (భారత కాలమానం ప్రకారం మార్చి 3న) అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరగనుంది. ఎంతో ప్రతిష్టాత్మక మైన ఈ పురస్కారాన్ని సొంతం చేసుకోవటా నికి పలువురు నటీనటులు, దర్శకులు పోటీపడ్డారు. 1968 తర్వాత సంగీత నేపథ్యం ఉన్న రెండు సినిమాలు వికెడ్, ఎమిలియా పెరెజ్ ఆస్కార్‌కు నామినేట్ అయ్యాయి. ఆస్కార్ చరిత్రలో రెండు మ్యూజికల్ బ్యాక్‌డ్రాప్ ఉన్న చిత్రాలు 10 లేదా అంత కంటే ఎక్కువ కేటగిరీల్లో నామినేట్ కావటం ఇది రెండోసారి. మొత్తం నామినేషన్లలో రేసులో ఎమిలియా పెరెజ్ 13 విభాగాల్లో ముందంజలో ఉంది. ఉత్తమ దర్శకుడు, రచనా విభాగంలో నామినేట్ కాకుండా 10 కేటగిరీల్లో నామినేషన్లు అందుకున్న మొదటి చిత్రంగా వికెడ్ రికార్డు సృష్టించింది. ఎమిలియా పెరెజ్ సినిమాను జాక్వెస్ ఆడియార్డ్ తెరకెక్కిం చారు. పరిస్థితుల కారణంగా ట్రాన్స్‌జెండర్‌గా మారిన ఓ డ్రగ్స్ లార్డ్ అనుభవాల్ని తెరపై కళ్లకు కట్టినట్లుగా చూపించటంలో ఆయన విజయ వంతం కావటంతో దర్శకుడి విభాగంలో ఆయన నామినేట్ అయ్యారు. హాలీవుడ్ నటి కర్లా సోఫియాగాస్కాన్ ఉత్తమ నటిగా నామినేషన్ దక్కించుకున్నారు. అండర్ వరల్డ్ డ్రగ్స్ నేపథ్యంలో సాగే 'ఎమిలియా పెరెజ్' చిత్రానికి గాను ఆమె ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. ఈ ఏడాది ఆస్కార్ బరిలో నిలిచిన మొదటి ట్రాన్స్‌జెండర్ కూడా ఆమె. ఫెర్నాండా టొర్రెస్ నటించిన ఐయామ్ స్టిల్ హియర్ నామినేషన్ దక్కించుకున్నారు. ఫెర్నాండా టొర్రెస్ కూడా పోటీ పడుతున్నారు. ఉత్తమ సహాయనటుడి విభాగంలో కిరెన్ కల్కిన్ (ది రియల్ పెయిన్), జెరీమీ స్ట్రాంగ్ (ది అప్రెంటిస్) ఇదే మొట్టమొదటి ఆస్కార్ నామినేషన్.

హాలీవుడ్ నటుడు జీన్ హ్యాక్‌మ్యాన్ మృతి




హాలీవుడ్ నటుడు జీన్ హ్యాక్‌మ్యాన్ (95) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఆయన రెండుసార్లు ఆస్కార్ అవార్డును అందుకున్నారు. న్యూమెక్సికోలోని ఇంట్లో జీన్‌తో పాటు ఆయన సతీమణి (63), పెంపుడు కుక్క చనిపోయి ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు అక్కడ ఎలాంటి అనుమానాస్పద సంకేతాలు కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఇద్దరూ బుధవారం మధ్యాహ్నం సన్‌సెట్‌ట్రైల్‌లోని వారి నివాసంలో చనిపోయారని నిర్ధారించామన్నారు. 1930లో జన్మించిన మిస్టర్ హాక్‌మన్ 100కుపైగా పాత్రలు పోషించారు. ఆయన నటనకు గానూ రెండు సార్లు ఆస్కార్ అవార్డులు వరించాయి. ఫ్రెంచ్ కనెక్షన్‌లో జిమ్మీ 'పొపాయ్' డోయల్ పాత్రకు బెస్ట్ యాక్టర్‌గా, అన్‌ఫర్గివెన్‌లో లిటిల్ బిల్ డాగెట్ పాత్రకు ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకున్నారు.

రెండోరోజు రాణించిన కేరళ బౌలర్లు

విదర్భ 379ఆలౌట్



నాగ్‌పూర్: రంజీట్రోఫీ ఫైనల్లో రెండోరోజు కేరళ బౌలర్లు సమిష్టిగా రాణించారు. తొలిరోజు కేవలం 4 వికెట్లను మాత్రమే చేజిక్కించుకున్న కేరళ బౌలర్లు.. రెండోరోజే ఏకంగా 6వికెట్లను పడగొట్టారు. ఓవర్‌నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 254పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భను కేరళ బౌలర్లు కళ్లెం వేశారు. మరో 125పరుగులకే చివరి ఐదు వికెట్లను పడగొట్టారు. దీంతో విదర్భ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 379పరుగులకే ఆలౌటైంది. కేరళ బౌలర్లు నిదీశ్, ఈడెన్ ఆప్లేకు మూడేసి, బసిల్‌కు రెండు, సక్సేనాకు ఒక వికెట్ దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కేరళ జట్టు రెండోరోజు ఆట ముగిసేసరికి మూడు వికెట్ల నష్టానికి 131పరుగులు చేసింది. అక్షయ్(14), కున్నుమ్మల్(0) నిరాశపరచగా.. ఆదిత్య(68నాటౌట్), ఇమ్రాన్(37) బ్యాటింగ్‌లో రాణించారు. క్రీజ్‌లో ఆదిత్యకు తోడు కెప్టెన్ సచిన్ బేబి(7) ఉన్నారు. విదర్భ బౌలర్లు నల్కేండేకు రెండు, యశ్ ఠాకూర్‌కు ఒక వికెట్



పాకిస్తాన్-బంగ్లాదేశ్ మ్యాచ్ వర్షార్పణం

రావల్పిండి: పాకిస్తాన్-బంగ్లాదేశ్ జట్ల మధ్య గడాఫీ స్టేడియంలో జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీ లీగ్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. కనీసం టాస్ వేసేందుకు కూడా అవకాశం దక్కలేదు. వర్షం కారణంగా రావల్పిండిలో జరగాల్సిన మ్యాచ్ రద్దు కావడం ఇది రెండోసారి. ఇంతకుముందు ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య మంగళవారం జరగాల్సిన మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దయిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తూ ఉండగా.. ఆ తర్వాత 3.30 గంIIల సమయంలో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు ఒక్కో పాయింట్ దక్కాయి. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఎలో ఈ రెండుజట్లు ఇప్పటికే సెమీస్ రేసునుంచి నిష్క్రమించాయి. ఈ వేదికలో జరిగి ఏకైక మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు ఐదు వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. గ్రూప్-ఎలో మిగిలిన ఏకైక మ్యాచ్ భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య దుబాయ్ వేదికగా ఆదివారం జరగనుంది. ఈ రెండుజట్లు గ్రూప్-ఎ నుంచి ఇప్పటికే సెమీస్‌కు చేరుకున్నాయి. బంగ్లాదేశ్(-0.443), పాకిస్తాన్(-1.087) రన్‌రేట్‌తో 3, 4 స్థానాల్లో నిలిచాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68